

# నేటి నిజం



తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 26-9-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక:53 | పేజీలు: 4 | వెల: రూ.1/-

## నేడు కొలువుదీరనున్న పంజాబ్ క్యాబినెట్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: పంజాబ్ క్యాబినెట్ రేపు కొలువుదీరనుంది. పంజాబ్ కొత్త ముఖ్యమంత్రి చరణ్‌జీత్ సింగ్ చన్నీ.. కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీతో చర్చించి తన క్యాబినెట్‌లో చేరబోయే వారి పేర్లను ఖరారు చేశారు. నూతన మంత్రివర్గాన్ని ఖరారు చేయడం కోసం చన్నీ.. సోమవారం తను ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి మూడుసార్లు ఢిల్లీకి వెళ్లారు. రాహుల్‌గాంధీతో చర్చించారు. చివరికి 15 మంది పేర్లను ఖరారు చేశారు. ఈ 15 మంది కొత్త మంత్రులు రేపు ప్రమాణస్వీకారం చేయనున్నారు.

చన్నీ మంత్రివర్గంలో ఏడు కొత్త ముఖాలు కనిపించనున్నట్లు సమాచారం. అదేవిధంగా కెప్టెన్ అమరీందర్‌సింగ్ ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన ఐదుగురికి కొత్త క్యాబినెట్‌లో చోటుదక్కలేదని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు అమరీందర్ సింగ్‌కు విశ్వాసపాత్రులైన కొందరికి మంత్రివర్గంలో చోటుకల్పించినా మరికొందరికి మొండి చేయి చూపినట్లు తెలిసింది. రాజ్‌కుమార్ వెర్క, కుల్జీత్ నగ్రా, గుర్‌కీరత్‌సింగ్ కొట్లీ, పర్గత్‌సింగ్, రాజా వారింగ్, రాణా గుర్జీత్, సుర్జీత్‌సింగ్ ధిమాన్ అనే ఈ ఏడుగురు ఎమ్మెల్యేలు పంజాబ్ క్యాబినెట్‌లో కొత్తగా చోటు దక్కించుకున్నట్లు సమాచారం.

అదేవిధంగా, మాజీ ముఖ్యమంత్రి అమరీందర్‌సింగ్‌కు విశ్వాసపాత్రులైన బ్రహ్మ మొహింద్రా, విజేంద్ర సింఘ్లా, భరత్‌భూషణ్ అషులకు చన్నీ మంత్రివర్గంలో చోటు కల్పించినట్లు తెలిసింది. అయితే, అమరీందర్ మంత్రివర్గంలోని ఆరోగ్యమంత్రి బల్బీర్ సిధూ, అటవీశాఖ మంత్రి సాధూసింగ్ ధరమ్సోట్, క్రీడా శాఖ మంత్రి రాణా, మరో ముగ్గురు మంత్రులు గుర్మీత్ సోఢీ, ఎస్ఎస్ అరోరా, గుర్‌ప్రీత్ కంగర్‌లకు చన్నీ మంత్రివర్గంలో చోటుదక్కలేదని సమాచారం.

## తెలంగాణకు భారీ వర్ష సూచన


హైదరాబాద్ , సెప్టెంబర్ 25:రాగల మూడు రోజులు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం శనివారం తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నిన్న సాయంత్రానికి వాయుగుండంగా మారిందని పేర్కొంది. పశ్చిమ దిశగా కదిలి.. మరింత బలపడి వాళ ఉదయం తీవ్ర వాయుగుండంగా మారింది. ఉత్తర, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో గోపాల్‌పూర్‌కు 470 కిలోమీటర్ల తూర్పు ? ఆగ్నేయ దిశలో, కళింగపట్నానికి తుర్పు-ఈశాన్య దిశలో 540 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది.

రాబోయే ఆరు గంటల్లో మరింత బలపడి తుపానుగా మారే అవకాశం ఉంది. పశ్చిమ దిశగా కదులుతూ ఉత్తర ఆంధ్రా ? దక్షిణ ఒడిశా తీర ప్రాంతంలో విశాఖపట్నం, గోపాల్‌పూర్ మధ్య కళింగపట్నం దగ్గర ఆదివారం సాయంత్రం తీరం దాటే అవకాశాలున్నాయి. 27న ఈశాన్య, పరిసర తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశాలున్నాయి. ఈ ఆవర్తనం ప్రభావంతో ఈశాన్య బంగాళాఖాతం పరిసర ప్రాంత్రాల్లో తదుపరి 24 గంటల్లో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నది.

ఈ అల్పపీడనం వాయువ్య దిశగా ప్రయాణించి 29 నాటికి పశ్చిమ బెంగాల్ తీరం దగ్గరకి చేరుకునే అవకాశం ఉంది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో మూడు రోజుల పాటు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. రేపు, ఎల్లుండి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇవాళ్టి నుంచి మూడు రోజుల పాటు చాలా జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయని వివరించింది.

## వైట్‌హౌజ్‌లో జోకులేసుకున్న మోదీ, బైడెన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:అమెరికా అధ్యక్షుడు జో బైడెన్.. ప్రధాని నరేంద్ర మోదీ.. వైట్‌హౌజ్ భేటీలో జోకులేసుకున్నారు. ఇండియాలో అయిదుగురు బైడెన్లు ఉన్నారంటూ జో బైడెన్ చేసిన కామెంట్‌కు ప్రధాని మోదీ స్పందిస్తూ.. వారికి సంబంధించిన డాక్యుమెంట్లను తీసుకువచ్చినట్లు చెప్పారు. దీంతో ఇద్దరి మధ్య చిరనవ్వులు పూశాయి. మోదీ, బైడెన్ మధ్య తొలిసారి ప్రత్యక్ష భేటీ జరిగింది. ఓవల్ ఆఫీసులో జరిగిన భేటీలో ఇద్దరూ పలు అంశాలపై మాట్లాడారు. ఇండియాలో అయిదుగురు బైడెన్లు ఉన్నారని, ఒకరు భారతీయ మహిళను పెళ్లి చేసుకున్నట్లు జో బైడెన్ జోకేశారు. అయితే అదే బాటలో రియాక్ట్ అయిన మోదీ.. బైడెన్ వారసులకు సంబంధించిన డాక్యుమెంట్లతో వచ్చినట్లు చెప్పారు. 1972లో 28 ఏళ్ల వయసులో తాను తొలిసారి సేనేటర్‌గా ఎన్నికయ్యానని, ఆ సమయంలో ప్రమాణ స్వీకారానికి ముందు తనకు ముంబై నుంచి ఓ లెటర్ వచ్చిందని, బైడెన్ పేరుతో ఆ లేఖ ఉందని, ఆ వ్యక్తి ఈస్ట్ ఇండియా కంపెనీలో పనిచేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయని జో బైడెన్ అన్నారు. అయితే ఇండియాలో అయిదుగురు బైడెన్లు ఉన్నట్లు ఆ తర్వాత మీడియా చెప్పినట్లు జో గుర్తు చేశారు. తాను జోక్ వేశారని, కెప్టెన్ జార్జ్ బైడెన్ అనే వ్యక్తి ఈస్ట్ ఇండియా టీ కంపెనీలో పనిచేస్తున్నట్లు చెప్పానన్నారు.కేవలం నవ్వుకోవాలన్న ఉద్దేశంతో జోక్ వేసినట్లు బైడెన్ తెలిపారు. జార్జ్ బైడెన్ ఆనవాళ్లను పసికట్టాలని, మన మీటింగ్ ఉద్దేశం అదే అని బైడెన్ అన్నారు. దీంతో ఓవల్ ఆఫీసులో నవ్వులు పూవాయి. జోక్‌లు పక్కనపెడితే, ఇండియా, అమెరికా మధ్య బంధం బలమైందని జో అన్నారు. ఇక తన వంతు రాగానే మోదీ మాట్లాడు



తూ.. బైడెన్ ఇంటిపేర్ల గురించి మీరు మాట్లాడారని, గతంలోనూ దీని గురించి చెప్పారని, అయితే వారి డాక్యుమెంట్ల కోసం అన్వేషించానని, వారికి సంబంధించిన కొన్ని దస్త్రాలు దొరికాయని, ఆ పేపర్లు మీకేమైనా ఉపయోగపడుతాయేమోనని మోదీ అన్నారు. దీంతో జో బైడెన్ నవ్వును ఆపుకోలేకపోయారు. భారత్‌లో తమ పూర్వీకులు ఉన్నారన్న అంశంపై గతంలోనూ ఓ సారి జో బైడెన్ గుర్తు చేశారు. ముంబైలో దూరపు బంధువులు ఉన్నట్లు ఆయన తెలిపారు. 2013లో అమెరికా ఉపాధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఆయన ముంబై విజిట్ చేశారు. తమ బంధువుల గురించి ఆరా తీయాలంటూ ఆ సమయంలో ఆయన అన్నారు. ఆ తర్వాత రెండేళ్లకు వాషింగ్టన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలోనూ ముంబైలో అయిదుగురు బైడెన్ల ఉన్నట్లు జో తెలిపారు. తమ ముత్తాత జార్జ్ బైడెన్ ఇండియాలో సెటిలయ్యారని, ఆయన భారతీయ మహిళను పెళ్లి చేసుకున్నట్లు చెప్పారు.

## అక్టోబర్ 25 నుంచి ఇంటర్ ఫస్టియర్ ఎగ్జామ్స్.. షెడ్యూల్ విడుదల

హైదరాబాద్ , సెప్టెంబర్ 25:తెలంగాణలో అక్టోబర్ 25 నుంచి ఇంటర్ ఫస్టియర్ ఎగ్జామ్స్ నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు శుక్రవారం ప్రకటించింది. 2020-21 విద్యాసంవత్సరానికి చెందిన ఫస్టియర్ విద్యార్థులకు (ప్రవెూటై ప్రస్తుతం సెకండియర్‌లో ఉన్న విద్యార్థులు) పరీక్షలు నిర్వహించనున్నారు. 70 శాతం సిలబస్ నుంచే ఎగ్జామ్స్ నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు.:

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎగ్జామ్స్ నిర్వహించనున్నారు. వ్యాక్సిన్ తీసుకున్న సిబ్బందినే విధుల్లోకి తీసుకుంటామన్నారు. ప్రతి ఎగ్జామ్ సెంటర్‌లో ఒకట్రెండు ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఏఎన్ఎం లేదా స్టాఫ్ నర్సు అందుబాటులో ఉండనున్నారు.

అక్టోబర్ 25న సెకండ్ లాంగ్వేజ్, 26న ఇంగ్లీష్, 27న మ్యాథ్స్-1ఏ, బోటనీ, పొలిటికల్ సైన్స్, 28న మ్యాథ్స్-1బీ, జువాలజీ, హిస్టరీ, 29న ఫిజిక్స్, ఎకనామిక్స్, 30న కెమిస్ట్రీ, కామర్స్, నవంబర్ 1న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, 2న మోడ్రన్ లాంగ్వేజ్, జియోగ్రఫీ పేపర్లకు ఎగ్జామ్స్ నిర్వహించనున్నారు.

## కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో సీఎం కేసీఆర్ భేటీ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం మధ్యాహ్నం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సాగునీటి ప్రాజెక్టులు, జలాల పంపిణీపై 40 నిమిషాల పాటు చర్చించారు. నిన్న మధ్యాహ్నం సీఎం కేసీఆర్ ఢిల్లీ పర్యటనకు వెళ్లిన విషయం విదితమే.

గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసిన వారిలో సీఎం కేసీఆర్‌తో పాటు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, రాజేందర్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఉన్నారు.

ఈ సందర్భంగా రాయలసీమ ఎత్తిపోతల పథకం వల్ల మహబూబ్‌నగర్ జిల్లాకు జరుగుతున్న నష్టం, కృష్ణా జలాల వివాదంలో ఇరు రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదాస్పద అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వడంతో పాటు, నీటి కేటాయింపులు జరపాలని కేంద్రమంత్రిని కోరినట్లు సమాచారం. కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ గెజిట్ నోటిఫికేషన్ అమలు తేదీ వాయిదా అంశాన్ని మరోసారి షేకావత్ వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. ఇరు రాష్ట్రాల మధ్య సంయుక్తంగా ఉన్న ప్రాజెక్టులను మాత్రమే నోటిఫికేషన్ పరిధిలోకి తీసుకురావాలని కేంద్రమంత్రిని కేసీఆర్ కోరినట్లు సమాచారం.

26న (ఆదివారం) ఢిల్లీ విజ్ఞాన్‌భవన్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నిర్వహించే నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల ముఖ్యమంత్రుల సమావేశంలో కేసీఆర్ పాల్గొంటారు. అనంతరం ధాన్యం కొనుగోలు అంశంపై కేంద్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో సమావేశం అవుతారు. అదేరోజు సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగివస్తారు. సీఎం వెంట ఢిల్లీకి వెళ్లిన అధికారుల్లో సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


## ప్రతిపక్షాలవి ఉద్దెర మాటలు : శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



హుజూరాబాద్, సెప్టెంబర్ 25:హుజూరాబాద్‌లోని జమ్మికుంటలో శనివారం జరిగిన రెడ్డి ఆత్మీయ సమ్మేళనానికి శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజూరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల వారి ఆహ్వానం, మంత్రి హరీశ్‌రావు కోరిక మేరకు ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. మిమ్మల్ని బంధువుగా పలకరించి వెళ్తామని వచ్చానే తప్ప, స్పీకర్ హోదాలో కాదన్నారు. ఈ సమ్మేళనానికి 15 వేల మంది వరకు వస్తారని మంత్రి హరీశ్‌రావు చెప్పారని, ఇక్కడ చూస్తే అంతకు మించి వచ్చారని ప్రశంసించారు.సీఎం కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తున్నదని కొనియాడారు. తెలంగాణ రాక ముందు నేను గ్రామాల్లోకి వెళ్తే రైతుల గురించి మాట్లాడాలంటే భయమేసేది. కరెంటు, నీళ్ల గురించి ఎక్కడ నిలదీస్తారేమోనని ఆయన తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో నేను వ్యవసాయ మంత్రి అయ్యాక? రైతులు తలెత్తుకునేలా పరిస్థితులు మారాయి. ఈ ఘనత కేసీఆర్‌దేనన్నారు.

24 గంటలపాటు ఉచితంగా వ్యవసాయానికి విద్యుత్‌ను ఇస్తున్నా రాష్ట్రం దేశంలో మనదేనని ఆయన స్పష్టం చేశారు. వ్యవసాయానికి కొత్త పథకాలు ప్రవేశపెట్టిన దేశాల గురించి ప్రపంచ వ్యాప్తంగా సర్వే చేస్తే.. భారతదేశంలో తెలంగాణలోని 69.70 లక్షల మంది రైతులకు రైతుబంధు ఇస్తున్నట్లు మాత్రమే గుర్తించారన్నారు. ప్రపంచంలో తెలంగాణ రాష్ట్రం ఒక్కటే రైతుబీమా కింద గుంట స్థలం ఉన్నా రైతులకు రూ.5 లక్షలు ఇస్తున్నదని తెలిపారు. కొవిడ్ సమయంలోనూ రైతులు పండించిన ప్రతి గింజనూ మూడు సీజన్లలో కొని పది రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేసిన ఏకైక సీఎం కేసీఆర్ అని కొనియాడారు. కరోనా వల్ల డబ్బుల్లేవు, ఖజానా ఖాళీ అయింది. ఆర్థిక మంత్రిగా హరీశ్‌రావు, సీఎం కేసీఆర్ సంతకాలు పెట్టి రూ.36 వేల కోట్లను బ్యాంకుల్లో రుణం తీసుకుని రైతాంగానికి ఇచ్చారన్నారు. అంతేకాకుండా ప్రాజెక్టులు నిర్మించి రాష్ట్రంలోని భూములను సాగుచేసేందుకు సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణ పథకం దేశంలో ఎక్కడా లేదన్నారు.బాన్సువాడలో సీఎం సహకారంతో గత నాలుగేండ్ల కాలంలో పేదలు, అన్ని వర్గాల వారికి ఐదువేల ఇండ్లు కట్టించానని, లబ్ధిదారులందరూ ఇండ్లలోకి వెళ్లారన్నారు. మరో ఐదువేల ఇండ్లు కావాలని సీఎంను అడుగగా ఆయన మంజూరు చేశారని, ప్రస్తుతం అవి నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. కొందరు మైక్ పట్టుకుని తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. రాజకీయం అంటే కోట్లాది మంది ఇచ్చిన పవిత్ర అస్త్రం. దీన్ని పవిత్రమైన మాటలతో, మంచి కార్యక్రమాలు చేపట్టాలి కానీ.. నువ్వెంత, నేనంత అనడం మంచిది కాదని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో మేము పది ఇస్తే? మీరు 11 ఇచ్చి మాట్లాడండి. కల్యాణలక్ష్మి పథకం కింద మేము రూ.లక్ష ఇస్తే? మీరు రూ. రెండు లక్షలు ఇవ్వాలని, వారివి ఉద్దెర మాటలని, సీఎం కేసీఆర్‌వి ఉద్దెర మాటలు కాదు? అంతా నగదేనని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు అమాయకులు కాదని, న్యాయనిర్ణేతలన్నారు. 25 ఏండ్లుగా నా నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదిస్తూ గెలిపిస్తున్నారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ భారత సినిమా రంగపు
కీర్తికి రూపమైన కేతన మగుచున్
వరకట్నములను గాన- గాంఢచెద
ఆరుగ నటియించునట్టి "దేవానందు"నే !!

(సెప్టెంబర్ 26 హీరో దేవానంద్ జయంతి...)



–రాధశ్రీ
సెల్: 9494481210

## పెగాసస్ ద్వారా ఫోన్లు హ్యాక్ చేస్తున్నారు : మోదీ సర్కార్‌పై దీదీ ఫైర్

కోల్‌కతా, సెప్టెంబర్ 25: పెగాసస్ ద్వారా తమ ఫోన్లను హ్యాక్ చేస్తున్నారని పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

బీజేపీ పాలనలో చట్ట నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు. భవానీపూర్‌లో శుక్రవారం జరిగిన ర్యాలీని ఉద్దేశించి దీదీ మాట్లాడారు.

బెంగాల్‌కు సీపీఎం తీవ్ర అన్యాయం చేసినా వారిపై ఎలాంటి విచారణలు, ఈడీ కేసులు లేవని గుర్తుచేశారు. బీజేపీ గూండాగిరీ చేస్తూ దౌర్జన్యాలు సాగిస్తోందని కాషాయపార్టీ నిత్యం అరాచకాలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. బీజేపీ శ్రేణులు వారి ఇండ్లపై వారే బాంబులు వేసుకుంటూ తమపై దాడి జరుగుతోందని గగ్గోలు పెడుతున్నారని ఆరోపించారు. తమ పార్టీ గూండాల పార్టీ కాదని దీదీ స్పష్టం చేశారు.

## భార్యపై కిరోసిన్ పోసి తగులబెట్టి భర్త ఆత్మహత్య

లక్నో, సెప్టెంబర్ 25: కుటుంబ తగాదాలు రెండు నిండు ప్రాణాలను బలితీసుకున్నాయి. భర్త రోజూ గొడవపడుతున్నాడని భార్య పుట్టింటికి వెళ్లి కొన్ని నెలలు గడిచినా తిరిగి రాకపోవడంతో.. ఆగ్రహానికిలోనైన భర్త ఆమెపై కిరోసిన్ పోసి తగులబెట్టి ఆపై తాను కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఈ ఘటనలో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరి జిల్లా ఈషాపూర్ ధోభా గ్రామంలో శనివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళ్తే.. ఫర్ధాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుత్నా గ్రామానికి చెందిన అజయ్ (28), రోమాదేవి (26) దంపతులు. గత కొంతకాలంగా ఈ ఇద్దరి మధ్య కుటుంబతగాదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం రోమాదేవి భర్తతో గొడవపడి ఈషాపూర్ ధోభాలోని పుట్టింటికి వెళ్లిపోయింది. ఇప్పటికీ తిరిగి రాకపోవడంతో ఆగ్రహానికి గురైన అజయ్ శనివారం ఉదయం ఓ కిరోసిన్ క్యాన్ తీసుకుని అత్తగారింటికి వెళ్లాడు.

రోమాదేవి కుటుంబసభ్యులు అజయ్ రాకను గమనించి అతను ఏం చేస్తున్నాడో గ్రహించేలోపే భార్యపై కిరోసిన్ పోసి నిప్పంటించి, తానూ నిప్పంటించుకున్నాడు. మంటలను ఆర్పి వారిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు.

## సీఎం మమత ఇటలీ టూర్‌కు.. కేంద్రం నిరాకరణ

కోల్‌కతా, సెప్టెంబర్ 25: ఇటలీ శాంతి సమావేశంలో పాల్గొనేందుకు పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. 'రాజకీయ కోణం' నేపథ్యంలో ఆమె క్లియరెన్స్‌ను తిరస్కరించినట్లు కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శనివారం తెలిపింది.

ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొనే హోదాకు అనుగుణంగా ఆ కార్యక్రమం జరుగడం లేదని పేర్కొంది.

అక్టోబర్‌లో మదర్ థెరిస్సా నేపథ్యంలో ఇటలీలో ప్రపంచ శాంతి సమావేశం జరుగనున్నది. కార్యక్రమ నిర్వాహకులు మమతను ఆహ్వానించారు. అయితే ప్రతినిధులతో కలిసి రావద్దని ఇటలీ ప్రభుత్వం ఇటీవల మమతను కోరింది. ఈ నేపథ్యంలో పరిశ్రమ ప్రతినిధి క్లియరెన్స్‌ను సీఎం మమతా బెనర్జీ ప్రతిపాదించారు. దీని కోసం విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖను ఆమె అభ్యర్థించారు. అయితే ఆ అనుమతిని కేంద్రం నిరాకరించింది.

మరోవైపు కేంద్ర ప్రభుత్వం తీరుపై టీఎంసీ అధికార ప్రతినిధి దేబాంగ్షు భట్టాచార్య మండిపట్టారు. గతంలో మమత చైనా టూర్‌ను కేంద్రం రద్దు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అంతర్జాతీయ సంబంధాలు, భారత దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని దానికి తాము అంగీకరించినట్లు తెలిపారు. ఇప్పుడు మమత ఇటలీ టూర్‌ను ఎందుకు రద్దు చేశారు మోడీ జీ? అని ట్విట్టర్‌లో ఆయన ప్రశ్నించారు. బెంగాల్‌తో మీకు సమస్య ఏమిటి? అని నిలదీశారు.

## గ్రంథాలయాలకు కాంపిటీటివ్ ఎగ్జామ్స్ మెటీరియల్



హైదరాబాద్ , సెప్టెంబర్ 25: పోటీ పరీక్షలకు కోసం విద్యార్థులకు అవసరమయ్యే స్టడీ మెటీరియల్ పుస్తకాలను రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలకు అందజేయనున్నట్లు ఆడిట్ శాఖ డైరెక్టర్ మార్తినేని వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

తన తండ్రి, స్వాతంత్ర్య సమర యోధుడు పట్టాభి రామారావు జ్ఞాపకార్థం స్టడీ మెటీరియల్‌ను రూపొందించారు. ఉస్మానియా యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరిలో ఆడిట్ డైరెక్టర్ శనివారం వాటిని ఆవిష్కరించారు. అనంతరం వాటిని సెంట్రల్ లైబ్రరీ అధికారులకు అందించారు. అలాగే రాష్ట్రంలోని 33 జిల్లాల గ్రంథాలయాలకు ఆడిట్ శాఖ ఉద్యోగులతో ఈ పుస్తకాలను పంపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు నూతనకంటి వెంకట్, రేవతి, ఆడిట్ అధికారులు వెంకటేశం, జయశ్రీ , ఉస్మానియా యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ అధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచ-స్థాయి పరిశోధనలకు చిరునామా మన సియస్ఐఆర్

**(26 సెప్టెంబర్ 'కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చి వ్యవస్థాపక దినం' సందర్భంగా)**

భారతదేశంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలుగల వైజ్ఞానిక మరియు పారిశ్రామికాభివృద్ధికి దోహదపడే పరిశోధనలకు పర్యాయపదంగా నిలిస్తున్న ప్రఖ్యాత సంస్థగా 'కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఒ ఇండస్ట్రియల్ రీసెర్చి (సియస్ఐఆర్)' సంస్థకు పేరుంది. దాదాపు ఎనిమిది దశాబ్దాలుగా అవిశ్రాంత అంతర్జాతీయ స్థాయి పరిశోధనా రంగ సేవలను మన దేశంలోనే చేస్తున్న సియస్ఐఆర్ నాయకత్వంలోని పలు సంస్థలు అత్యాధునిక శాస్త్ర సాంకేతిక పరిశోధనలు చేస్తున్నాయి. 26 సెప్టెంబర్ 1942 రోజున భారత ప్రభుత్వం పక్షాన వ్యవస్థాపకులు రామస్వామి మదలియర్ మరియు శాంతి స్వరూప్ భట్నాగర్‌ల నాయకత్వంలో స్వయం ప్రతిపత్తిగల సియస్ఐఆర్ ఆవిర్భవించింది. న్యూఢిల్లీ ప్రధానకేంద్రంగా 2013 నాటికి సియస్ఐఆర్ గొడుగు కింద 41 ప్రయోగశాలలు లేదా సంస్థలు, 39 అవుట్‌రీచ్ సెంటర్లు, 3 ఇన్నొవేషన్ సెంటర్లు మరియు 5 యూనిట్లు దేశ నలుమూలల విస్తరించబడి పరిశోధనలు చేస్తున్నాయి. ఈ ప్రతిష్టాత్మక సంస్థలన్నింటిలో 4,600 సైంటిస్టులు, 8,000 టెక్నికల్ సిబ్బందిని కలుపుకొని 14,000 మంది ఉద్యోగులు వైజ్ఞానిక పరిశోధనలలో నిమగ్నమై ఉన్నాయి. సియస్ఐఆర్ పరిశోధనా సంస్థలలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, ఓషియన్ సైన్స్, లైఫ్ సైన్స్, మెటలర్జీ, కెమికల్, ఫుడ్, పెట్రోలియం, లెదర్, ఎన్విరాన్‌మెఎటల్ సైన్స్ విభాగాలలో విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. ప్రతిష్టాత్మక పాలక సంస్థ సియస్ఐఆర్ ద్వారా 2971 అంతర్జాతీయ మేధో హక్కుల పెటెంట్స్ మరియు 1592 ఇండియన్ పెటెంట్స్ ప్రస్తుతం అమలులో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా సియస్ఐఆర్ నుండి 14,000 పైగా పెటెంట్లు మంజూరు అయినాయి. ఇప్పటి వరకు 1400లకు పైగా టెక్నాలజీస్‌ను అభివృద్ధి చేసిన సియస్ఐఆర్ సంస్థ ఏర్పాటులో నోబెల్ బహుమతి గ్రహీత సర్ సి వి రామన్ కూడా గౌరవ సలహాదారుగా సేవలందించారు.


సియస్ఐఆర్ పరిశోధనల ప్రగతి:

1950లో మిథాక్వలోన్ అనబడే సింథటిక్ డ్రగ్‌ను సియస్ఐఆర్ సంస్థ మె?దటిసారి అభివృద్ధి చేసింది. రక్షణశాఖ అవసరాలకు ఆప్టికల్ గ్లాస్, స్వరాజ్ ట్రాక్టర్, వెదురు పుష్పించడం, అండమాన్ గిరిజన మూలాలు, డ్రోసోఫిలా కాన్సర్ డ్రగ్, కుటుంబ నియంత్రణకు వాడే సహేళి డ్రగ్, ఫ్లోసాల్వర్ కంప్యూటర్, 14 సీట్ల సరస్ విమానం, హ్యూమన్ జీనోమ్ శోధనలు, ప్రథమ స్వదేశీ పౌర ఎయిర్‌క్రాఫ్ట్ మరియు 2020లో కోవిడ్-19 మరణాల రేటును తగ్గించే సెప్సివాక్ క్లినికల్ ట్రయల్స్ లాంటి అనేక ముఖ్య ఆవిష్కరణలు సియస్ఐఆర్ నేతృత్వంలోని చేపట్టడం భారతీయులందరికీ గర్వకారణం. ప్రముఖ శాస్త్రవేత్త సియస్ఐఆర్ వ్యవస్థాపక డైరెక్టర్ శాంతి స్వరూప్ భట్నాగర్ స్మారకార్థం 1958లో స్థాపించబడిన 'శాంతి స్వరూప్ భట్నాగర్ పురస్కారాన్ని' శాస్త్ర సాంకేతిక రంగంలో ఉత్తమ పరిశోధకులను ఎంపిక చేసి 5 లక్షల నగదు, నెలకు 15,000/- పారితోషికం ఇవ్వడం జరుగుతున్నది. దేశవ్యాప్తంగా విస్తరించబడి ఉన్న 40కి పైగా సియస్ఐఆర్ ప్రయోగశాలల్లో తెలంగాణ రాష్ట్రంలో సెంటర్ ఫర్ సెల్యులార్ మాలిక్యులార్ బయాలజీ (సిసియంబి), నేషనల్ జియోఫిజికల్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ (యన్‌జిఆర్ఐ), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసిటి)లు జాతీయ అంతర్జాతీయ పరిశోధనా సంస్థలుగా సియస్ఐఆర్‌కు ఎనలేని కీర్తిని తెచ్చాయి. సియస్ఐఆర్ నేతృత్వంలో 18 జర్నల్స్, 3 పాపులర్ సైన్స్ మాగజీన్లు ప్రచురితం అవుతున్నాయి.

కోవిడ్-19 పరిశోధనల్లో సియస్ఐఆర్:

కరోనా వైరస్‌కు అడ్డుకట్ట వేయడానికి సియస్ఐఆర్ గత ఏడాదిన్నర కాలంగా తీవ్ర కృషి చేస్తున్నది. కోవిడ్-19 వైద్యంలో వినియోగించే ఔషధాలు, క్లోరోక్విన్ ఫాస్ఫేట్, ఆంటీ-సార్స్ డ్రగ్స్, భారత్ బయోటెక్‌తో కలిసి కరోనా టీకా, బ్రాడ్ స్పెక్ట్రమ్ ఆంటీ-వైరల్ ఏజంట్లు, కోవిడ్-19 రోగ నిర్ధారణ కిట్లు, వైరస్ వ్యాప్తి శోధనలు, ప్లాస్మా థెరపీ, మాల్‌న్యూపిరావిర్, రెమిడెసివిర్, ఫవీపిరవిర్, డ్రగ్ లాంటి ప్రధాన పరిశోధనా ఫలితాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే 25కు పైగా కరోనా ఔషధాలు క్లినికల్ ట్రయల్స్ పపూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. కరోనా వ్యాప్తిని కట్టడి చేయడానికి సంబంధించిన వెంటిలేటర్లు, ఆక్సీజనేటర్లు, స్ప్రేలు, సానిటైజర్లు, మాస్కులు వంటి సదుపాయాలను సియస్ఐఆర్ పరిశోధనలు కల్పించాయి.

సియస్ఐఆర్ చరిత్రలో పేరొందిన ఆవిష్కరణలుగా గేదె పాల నుండి పసి పిల్లలకు పాల ఆహార ఉత్పత్తుల టెక్నాలజీని అముల్ కంపెనీకి అందించి శ్వేత విప్లవానికి నాంది పలికింది. ఉత్ప్రేరకాల రూపకల్పనతో పారిశ్రామిక ఉత్పత్తుల వేగం పెంచడం, హెచ్ఐవి-ఎయిడ్స్ కట్టడికి చవకైన డ్రగ్స్ డిజైన్ చేయడం, స్వదేశీ పరిజ్ఞానంతో సూపర్ కంప్యూటర్, పర్యవరణ పరిరక్షణ పరిశోధనలు, బీడుభూముల వినియోగం ప్రయోగాలు, ఫ్లోరైడ్ బాధిత ప్రజలకు సురక్షిత తాగు నీరు అందించే టెక్నాలజీ, జీవశాస్త్ర సంబంధ పరిశోధనల్లో ప్రగతి, వెదురు పూతల టిష్యూ పరిశోధనలు, కలరా టీకాల పరిశోధనలు, 3.2 బిలియన్ బేస్‌లు గల మానవ జీనోమ్ శ్రేణిని తెలుసుకోవడం, డియన్ఏ ఫింగర్ ప్రింటింగ్, మెంథాల్ మింట్ పరిశోధనలు, డిజాస్టర్ మెనేజ్‌మెంట్, మైన్ సేఫ్టీ లాంటి అనేక ప్రజాప్రయోజన పరిశోధనా ఫలితాలను మానవాళికి అందిస్తున్న సియస్ఐఆర్, భవిష్యత్తులో మరిన్ని జనహిత పరిశోధనలను చేసి, సామాన్యుల మన్ననలు పొందాలని ఆశిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## అక్టోబర్ 1వ తేదీన పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ..

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:'ఆజాది కా అమృత్ మహోత్సవ్'ను పురస్కరించుకొని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పిఎఫ్ఆర్‌డిఎ) ప్రచారాన్ని ప్రారంభించింది. పెన్షన్, పదవీ విరమణపై మరింత ప్రచారాన్ని కల్పించేందుకు అక్టోబర్ 1న తేదీని నేషనల్ పెన్షన్ సిస్టమ్ దివస్(ఎన్పిఎస్ దివస్)గా పాటిస్తారు. తన సోషల్ మీడియా ప్లాట్ఫామ్ ల ద్వారా పిఎఫ్ఆర్‌డిఎ 'చనిజూబటతిలిజీబ' హ్యాష్ ట్యాగ్ పేరుతో ఈ ప్రచారాన్ని చేస్తోంది.

వర్కింగ్ ప్రొఫెషనల్స్ మొదలుకొని, స్వయం ఉపాధి నిపుణుల వరకు ప్రతి పౌరుడు పదవీ విరమణ తర్వాత ఆర్థికంగా మంచి భవిష్యత్తును నిర్ధారించుకోవడానికి, ఆర్థిక పరిపుష్టి పొందడానికి పిఎఫ్ఆర్‌డిఎ ప్రణాళిక రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల నేషనల్ పెన్షన్ సిస్టమ్ చందాదారులు ప్రస్తుతం కొన్ని ప్రయోజనాలు పొందడంతోపాటు పదవీ విరమణ తర్వాత అనేక ప్రయోజనాలను పొందుతారు.

"పెన్షన్, పదవీ విరమణ ప్రణాళిక కోసం అక్టోబర్ 1వ తేదీని నేషనల్ పెన్షన్ స్టిస్టమ్ దివస్గా ప్రకటించడం సంతోషంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో మేమూ పాల్గొంటున్నందుకు సంతోషిస్తున్నాం. ఈ ప్రచారం ద్వారా ప్రజలకు పెన్షన్ ప్రణాళికపై మేము అవగాహన కల్పిస్తాము. ఒక పెన్షన్ నియంత్రణ సంస్థగా మేము పెన్షన్ సొసైటీ ఆఫ్ ఇండియా లక్ష్యాన్ని నెరవేర్చడం కోసం అర్హులైన పౌరులందరినీ పెన్షన్ పథకం కిందకు తీసుకురావడమే ప్రస్తుతం మా ముందున్న లక్ష్యం"అని పిఎఫ్ఆర్‌డిఎ చైర్‌పర్సన్ శ్రీ సుప్రతిమ్ బంద్యోపాధ్యాయ్ అన్నారు

పిఎఫ్ఆర్‌డిఎ గురించి..

పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ మరియు డెవలప్‌మెంట్ అథారిటీ అనేది భారతదేశంలో పెన్షన్ల్కు సంబంధించి మొత్తం పర్యవేక్షణ మరియు నియంత్రణ కోసం భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలో ఉన్న నియంత్రణ సంస్థ. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ మరియు డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 19 సెప్టెంబర్, 2013 న ఆమోదించబడింది. మరియు 1 ఫిబ్రవరి 2014 న నోటిఫై చేయబడింది. ప్రభుత్వ ఉద్యోగులు చందాదారులుగా చేరిన నేషనల్ పెన్షన్ సిస్టమ్ను పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ మరియు డెవలప్‌మెంట్ అథారిటీ నియంత్రిస్తుంది. భారతదేశం, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు ప్రైవేట్ సంస్థలు, అసంఘటిత రంగాల ఉద్యోగుల ద్వారా పెన్షన్ మార్కెట్ లో క్రమబద్ధమైన పురోగతిని, అభివృద్ధిని సాధించేలా చర్యలు తీసుకుంటుంది.

## ఫుల్లెర్టన్ ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్‌లో వాటాల కొనుగోలుకు సిసిఐ ఆమోదం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:ఫుల్లెర్టన్ ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్ (ఎఫ్ఐసిసి/టార్గెట్) లో సుమిటోమో మిత్సుయ్ ఫైనాన్షియల్ గ్రూప్, ఇంక్(ఎస్ఎంఎఫ్‌జి/అక్వైజర్) వాటాల కొనుగోలుకు కాంపిటేషన్ యాక్ట్, 2002 సెక్షన్ 31(1 ) కింద కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ఆమోదం తెలిపింది.

ప్రతిపాదిత కలయిక అనేది కొనుగోలుదారు ద్వారా టార్గెట్ ఈక్విటీ షేర్ క్యాపిటల్ కొనుగోలుకు సంబంధించినది. ఇది సముపార్జన స్వభావం మరియు కాంపిటీషన్ యాక్ట్, 2002 సెక్షన్ 5 (ఎ) కిందకు వస్తుంది.

ఎస్ఎంఎఫ్‌జి అనేది సుమిటోమో మిట్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబిసి) మరియు దాని ఇతర గ్రూప్ కంపెనీల హోల్డింగ్ కంపెనీ. దీని ప్రాథమిక వ్యాపారం బ్యాంకింగ్ అనుబంధ సంస్థలు మరియు ఇతర కంపెనీలను నిర్వహించడం. వాణిజ్య బ్యాంకింగ్‌తో పాటు, ఎస్ఎంబిసి గ్రూప్ లీజింగ్ ఫైనాన్స్, ప్రాజెక్ట్ ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ ఫైనాన్సింగ్, సెక్యూరిటీలు మరియు డెరివేటివ్‌లు, మారిటైమ్ ఫైనాన్స్, కన్స్యూమర్ ఫైనాన్స్, క్రెడిట్ కార్డ్, ట్రేడ్ ఫైనాన్స్, క్యాష్ మేనేజ్‌మెంట్ మొదలైన వివిధ రకాల ఆర్థిక సేవలలో కూడా నిమగ్నమై ఉంది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఎఫ్ఐసీసీ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీగా నమోదు చేయబడింది. ఇది ప్రధానంగా వాణిజ్య వాహనాలు మరియు ద్విచక్ర వాహనాల రుణాలు, ఆస్తి రుణాలు, సెక్యూరిటీ రుణాలు, వ్యక్తిగత రుణాలు, రియల్ ఎస్టేట్ డెవలపర్‌లకు అందించే రుణాలు, వ్యాపారాలకు అందించే రుణాలు మరియు గ్రామీణ సంఘీభావ సమూహాలకు రుణాలు అందించడంలో నిమగ్నమై ఉంది. ఫుల్లెర్టన్ ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ (ఎఫ్ఐహెచ్ఎఫ్‌సి), ఎఫ్ఐసీసీకు చెందిన పూర్తి యాజమాన్యంలోని అనుబంధ సంస్థ. నేషనల్ హౌసింగ్ బ్యాంక్‌లో డిపాజిట్ చేయని హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ (హెచ్ఎఫ్‌సి) లో ఇది నమోదు చేయబడింది.

## మరోసారి తగ్గిన బంగారం ధరలు..



హైదరాబాద్ , సెప్టెంబర్ 25:మన దేశంలో గత కొన్ని రోజులుగా బంగారం ధరలు పెరుగుతూ, కొద్దిగా తగ్గుతూ వస్తున్నాయి. ఓ రోజు పెరిగితే? ఓ తగ్గుతున్నాయి. ఇక తాజాగా బంగారం ధరల్లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. బంగారం ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో ధరలు ఇలా ఉన్నాయి. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 400 తగ్గి రూ. 43,200 కి చేరింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 430 తగ్గి రూ. 47,130 కి చేరిది. దేశీయంగా మార్కెట్లు తిరిగి క్రమంగా పుంజుకోవడంతో బంగారం ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ఇక బంగారం ధరలు తగ్గితే? వెండి ధరలు కూడా కాస్త తగ్గాయి. కిలో వెండి ధర రూ. 64, 900 వద్ద కొనసాగుతోంది.

## కోవిడ్ అనంతర సీక్వెల్ మాడ్యూల్‌ను విడుదల చేసిన కేంద్ర ఆరోగ్య మంత్రి శ్రీ మన్‌సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ మన్‌సుక్ మాండవీయ ,కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయమంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ సమక్షంలో కోవిడ్ అనంతర సీక్వెల్ మాడ్యూళ్లను విడుదల చేశారు. ఈ మాడ్యూళ్ళు దేశ వ్యాప్తంగా గల వైద్యులు, నర్సులు, పారామెడికల్‌సిబ్బంది, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, కోవిడ్ అనంతర దీర్ఘకాలిక ప్రభావాలను ఎదుర్కొనడానికి పనికి వస్తాయి.

మార్గదర్శకాల పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ కేంద్ర మంత్రి, డాక్టర్లు, హెల్త్ కేర్ వర్కర్లు కోవిడ్ దీర్ఘకాలిక ప్రభావాలను ఎదుర్కోవడానికి ఈ మార్గదర్శకాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కనీస సైడ్ ఎఫెక్టులు ఉండడానికి, చికిత్సకు సంబంధించి ఎలాంటి దుష్పరిణామాలు కలగకుండా ఉండడానికి ఇవి ఉపయోగపడతాయి.

మ్యుకోర్ మైకోసిస్ వంటి కేసులలో ఎక్కువ మోతాదులో స్టెరాయిడ్ డోస్‌లు వాడడం వల్ల పేషెంట్లలో కోవిడ్ అనంతర ప్రభావానికి సంబంధించిన పరిణామాలను చూడడం జరిగిందని ఆయన చెప్పారు. అందువల్ల తక్కువ సైడ్ ఎఫెక్టులు లేదా కనీస సైడ్ ఎఫెక్ట్‌లు కలిగిన మందులు తీసుకోవడం ముఖ్యమని ఆయన అన్నారు. మనం ముందుగా మేల్కొంటే, కోవిడ్ అనంతర పరిస్థితులను ఎదుర్కోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.కోవిడ్ అనంతర పరిస్థితులకు సంబంధించి సమాజంలో పలు భయాలు, ఆరోగ్య సంబంధ సమస్యలు వంటివి ఉన్నాయి. వీటిని జాగ్రత్తగా ఎదుర్కొవలసి ఉంది. అందువల్ల కోవిడ్ అనంతర సమస్యలను అర్థం చేసుకుని వాటిని పరిష్కరించుకోవలసి ఉంది. కోవిడ్ అనంతర సీక్వెల్ మాడ్యూళు రూపొందించడానికి దేశ వ్యాప్తంగా గల రిసోర్స్ పర్సన్‌లు గట్టి కృషి చేశారు. ఇవి అత్యంత ప్రత్యేక మాడ్యూళ్లు. ఇవి అత్యంత ప్రత్యేక మాడ్యూళ్లు.వివిధ రంగాలకు చెందిన ఆరోగ్య ప్రొఫెషనల్స్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ మాడ్యూళ్లు రూపొందించడం జరిగింది.

ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్, మానసిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవలసిన అవసరాన్నివారు ప్రస్తావించారు. ప్రస్తుత కోవిడ్ మహమ్మారి ఆరోగ్యం, ఆరోగ్య సంరక్షణవ్యవస్థకు పలు సవాళ్లు విసిరిందని డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ అన్నారు. మానసిక ఆరోగ్య సంరక్షణ అనేది భారీ జనాభా గల దేశంలో పెద్ద సవాలు అని అన్నారు. మానసిక ఆరోగ్య సంరక్షణను ఎదుర్కొనేందుకు మనం మన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఫ్రంట్‌లైన్ వర్కర్లను సమర్థులుగా తీర్చిదిద్దినట్టయితే వారికి తగిన పరిజ్ఞానాన్ని అందించినట్టయితే కోవిడ్ అనంతరం ఏర్పడే సవాళ్లను ఎదుర్కోవడానికి వీరు ఎంతగానో ఉపయోగపడతారు. మనం కోవిడ్ అనంతర పరిణామాలను ఎదుర్కొవడానికి మనకు మనం సన్నద్ధులం కావడానికి ప్రయత్నించడంతోపాటు, వీటిని చివరికంటా తీసుకుపోవడం కూడా ఎంతో అవసరం. రాష్ట్రాల ఆరోగ్య కార్యకర్తల అవసరాలకు అనుగుణంగా మానసిక ఆరోగ్యం , ఇతర అంశాలకు సంబంధించి శిక్షణ మాడ్యూళు సిద్ధమ య్యాయి.కోవిడ్ -19 అనేది ఇక ఇదే చిట్టచివరి మహమ్మారికావాలని ఆమె ఆకాంక్షించారు.

కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ రాజేష్ భూషణ్, డిజిహెచ్ ఎస్ డాక్టర్ సునీల్ కుమార్, ఆరోగ్యకుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖకు చెందిన ఇతర సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## దేశాలలో ఒకటిగా భారతదేశాన్ని మార్చడానికి ప్రణాళికను రూపొందించడానికి వర్క్‌షాప్‌ను నిర్వహించిన ఎలక్ట్రానిక్స్ మరియు ఐటి మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: భారతదేశాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద అనుసంధాన దేశాలలో ఒకటిగా మార్చడానికి అమలు చేయాల్సిన కార్యాచరణ పథకాన్ని రూపొందించడానికి ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ 'కనెక్టింగ్ ఆల్ ఇండియన్స్' పేరిట ఒక వర్క్‌షాప్‌ను నిర్వహించింది. వర్క్‌షాప్ లో దేశంలో ఇంటర్నెట్ సేవలను అందిస్తున్న జియో, ఎయిర్‌టెల్ సహా ప్రభుత్వ మరియు ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు, ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, టెలికమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇంటర్నెట్ సేవలు తక్కువగా లేదా అందుబాటులో లేని ప్రాంతాల వివరాలను సమావేశంలో చర్చించారు.

ప్రపంచంలోనే అతిపెద్ద ఫైబర్ ఆధారిత గ్రామీణ బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ ప్రాజెక్టుగా గుర్తింపు పొందిన భారత్ నెట్ పని తీరును కూడా వర్క్‌షాప్‌లో సమీక్షించారు. దేశంలో అన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ అందుబాటులో ఉండాలని ప్రధానమంత్రి ఆలోచనను కార్యరూపంలోకి తీసుకుని రావడానికి భారత్ నెట్ అమలు జరుగుతున్నది. ఇంటర్నెట్ సౌకర్యం లేని ప్రాంతాలు/గ్రామాల్లో సేవలను అందించడానికి అమలు చేయాల్సిన చర్యలను సమావేశంలో చర్చించారు.

కేంద్ర సహాయ మంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ అధ్యక్షతన వర్క్‌షాప్ జరిగింది. ప్రతి ఒక్కరికి సురక్షితమైన ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని మంత్రి తెలిపారు. డిజిటల్ ఇండియా ద్వారా ప్రతి ఒక్కరికీ ఇంటర్నెట్ అందుబాటులోకి తెచ్చి డిజిటల్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి ఈ రంగంలో ఉపాధి అవకాశాలను ఎక్కువ చేయాలన్నది ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆశయమని మంత్రి వివరించారు.

ఇంటర్నెట్ సేవలను మరింత ఎక్కువగా అందుబాటులోకి తీసుకుని రావడానికి అమలు చేయాల్సిన చర్యలపై ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల ప్రతినిధులు సలహాలు సూచనలను అందించారు.

## ఉత్తర రాష్ట్రాల పార్లమెంట్ సభ్యులతో సమావేశమైన కేంద్ర మత్స్య, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమల శాఖ మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:కేంద్ర మత్స్య, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమల శాఖ మంత్రి అధ్యక్షతన ఉత్తర భారతదేశానికి చెందిన పార్లమెంట్ సభ్యుల సమావేశం జరిగింది. వర్చువల్ విధానంలో జరిగిన ఈ సమావేశంలో జమ్మూ కాశ్మీర్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, చండీఘర్, లడఖ్ రాష్ట్రాలకు చెందిన పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు. కేంద్ర మత్స్య, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమల మంత్రిత్వ శాఖ కార్యదర్శి, సంయుక్త కార్యదర్శులు , ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు.

పశు సంవర్ధక మరియు పాడి పరిశ్రమ రంగంలో అమలు చేస్తున్న పథకాల వివరాలను పార్లమెంట్ సభ్యులకు మంత్రి వివరించారు. పథకాల ప్రయోజనాలను వివరించిన మంత్రి క్షేత్ర స్థాయిలో పశు సంపద మరియు పాడి పథకాలను మరింత పటిష్ఠంగా అమలు చేయుడానికి తీసుకోవలసిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ పథకాల వల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు.

పశువుల పెంపకం దారుల, పశు గ్రాస వ్యవస్థాపకులను నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ మరియు రాష్ట్రీయ గోకుల్ మిషన్ పరిధిలోకి తీసుకుని రావాలని ఇటీవల జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద అధిక జన్యుపరమైన దూడల ఉత్పత్తి మరియు సరఫరా కోసం యూనిట్లను నెలకొల్పే పారిశ్రామికవేత్తలకు 50% మూలధన సబ్సిడీ నేరుగా అందించడం జరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచి, ఎక్కువ మందికి పశువులు, పాడి, పౌల్ట్రీ, గొర్రెలు, మేకలు, పందులు పెంపకం, పశుగ్రాస రంగంలో ఉపాధి అవకాశాలను కల్పించాలన్న లక్ష్యంతో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ అమలు జరుగుతున్నదని మంత్రి తెలిపారు. ఆత్మ నిర్భర్ భారత్ సాధన కోసం అమలు జరుగుతున్న ఈ కార్యక్రమాల్లో 50 శాతం సబ్సిడీ అందిస్తున్నారు.

పాడి రంగాన్ని అభివృద్ధి చేయడానికి నేషనల్ ప్రోగ్రాం ఫర్ డైరీ డెవలప్‌మెంట్ (ఎన్‌పిడిడి) పథకం అమలు జరుగుతున్నదని పార్లమెంట్ సభ్యులకు మంత్రి వివరించారు. ఈ పథకం కింద పాల సేకరణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ మరియు పాలు మరియు పాల ఉత్పత్తుల నాణ్యత అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పశువుల ఆరోగ్యం, వ్యాధుల నివారణకు టీకాలను వేసే కార్యక్రమం కూడా అమలు జరుగుతున్నదని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రాలలో మొబైల్ వెటర్నరీ యూనిట్ల ద్వారా పశువుల ఆరోగ్య సంరక్షణ సేవలను రైతులకు వారి ఇళ్ల వద్దనే అందిస్తున్నామని అన్నారు.

పశువులు, పాడి రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలని మంత్రి సూచించారు. సమావేశానికి హాజరైన సభ్యులను అభినందించిన మంత్రి వారి సలహాలు సూచనలను అమలు చేసి పాడి రంగ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## 'ఆజాది కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా సైక్లింగ్ ర్యాలీ


న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:భారతదేశ 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తోన్న ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా తుగ్లకాబాద్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ సైక్లింగ్ యాత్రను చేపట్టింది. ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ తుగ్లకాబాద్ మరియు ఎయిర్ ఫోర్స్ స్టేషన్ ప్రహ్లాద్‌పూరల నుండి 40 మంది వాయుసేన యోధుల బృందం ఈ సైక్లింగ్ యాత్రలో పాల్గొంది. ఎయిర్ ఫోర్స్ స్టేషన్ తుగ్లకాబాద్


ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్ అయిన ఎయిర్ కమాడోర్ వై ఉమేష్ ఈ బృందానికి మొత్తంగా అధ్యక్షత వహించారు. ఈయనతో పాటు ప్రహ్లాద్‌పూర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌కు స్టేషన్ కమాండర్ గ్రూప్ కెప్టెన్ డీవీబీకే మెహర్‌కూడా గ్రూపు సారథ్యం వహించారు. 18 సెప్టెంబర్ 21న న్యూఢిల్లీలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ తుగ్లకాబాద్‌లో ఈ యాత్రను ప్రారంభించారు. ఈ బృందం 18 సెప్టెంబర్ 21న న్యూఢిల్లీలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ తుగ్లకాబాద్ నుండి షాహిద్ స్మారక్ వరకు.. దాదాపుగా 90 కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించింది. భారత వైమానిక దళంలో అందుబాటులో ఉన్న కెరీర్ అవకాశాలపై యువతలో అవగాహన కల్పించడానికి మీరట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వద్ద ఈ బృందం ఆగి మరియు సాహస స్ఫూర్తిని ప్రదర్శించింది.

## మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని.. నానమ్మను హత్య చేసిన మనవడు

చెన్నై, సెప్టెంబర్ 25: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో నానమ్మను మనవడు హత్య చేశాడు. తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లాలో ఈ ఘటన జరిగింది. వసువనపాలెం గ్రామానికి చెందిన సుశీల అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేసి రిటైర్ అయ్యింది. ఆమె కుమారుడు రంగనాథన్ చెన్నైలోని వనగ్రామ్‌లో నివసిస్తున్నాడు. రంగనాథన్ కుమారుడు 30 ఏండ్ల జగన్ అప్పుడప్పుడు నానమ్మ ఇంటికి వస్తుండేవాడు. ఈ క్రమంలో ఇటీవల నానమ్మ సుశీల ఇంటికి వచ్చిన మనవడు జగన్ బుధవారం రాత్రి మద్యం కొని తాగేందుకు డబ్బులు అడిగాడు. దీనికి ఆమె నిరాకరించడంతో ఆగ్రహించిన జగన్ అట్ల పెన్నంతో నానమ్మ తలపై బలంగా కొట్టాడు. దీంతో ఆ వృద్ధురాలు చనిపోయింది.అనంతరం అక్కడి నుంచి పారిపోయిన జగన్ సమీప గ్రామంలోని తన స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి నిందితుడు జగన్‌ను అరెస్ట్ చేశారు. అతడ్ని ప్రశ్నించగా నానమ్మను తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


## కళాకారి ఫిల్మ్ ఫెస్టివల్‌లో 500 మహిళా చిత్రాల ప్రదర్శన





ఇండోర్, సెప్టెంబర్ 25: మహిళా ఫిల్మ్‌మేకర్లను ప్రోత్సహించేందుకు ఈసారి కళాకారి ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు. కెమెరా కన్నుల వెనుక దాగి ఉన్న మహిళా ట్యాలెంట్‌ను పైకి తీసుకురావాలన్న ఉద్దేశంతోనే ఈ సారి మహిళ ఫిల్మ్‌మేకర్లకు పెద్దపీట వేయనున్నారు. ఆరవ ఎడిషన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మహిళలు తీసిన, మహిళలకు సంబంధించిన 500 చిత్రాలకు సపోర్ట్ ఇవ్వనున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన రిశీ నికమ్ కళాకారి ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నాడు. మహిళా ఫిల్మ్‌మేకర్లకు సపోర్ట్ ఇవ్వడమే ఆయన ఉద్దేశం. చిత్రోత్సవంలో 500 సినిమాలను ప్రదర్శించనున్నారు. వివిధ భారతీయ భాషల్లో మహిళలు తీసిన సినిమాలను ప్రదర్శిస్తారు. సినీ నిర్మాణంలో లింగ వివక్ష ఉండకూడదని కళాకారి నికమ్ తెలిపారు. ప్రపంచ స్థాయిలో భారతీయ మహిళలు తమ ట్యాలెంట్‌ను చూపిస్తారన్న ఉద్దేశంతో ఫిల్మ్ ఫెస్టివల్‌ను ఆర్గనైజ్ చేస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి చిత్రోత్సవాలతో మహిళా ఫిల్మ్‌మేకర్లకు గౌరవం పెరుగుతుందన్నారు. వివిధ దేశాలకు చెందిన మహిళలు కూడా తమ ఫిల్మ్ నైపుణ్యాన్ని ప్రదర్శించన్నారు. ఫిబ్రవరిలో జరిగే ఈ ఈవెంట్ కోసం ఆసక్తికలవారు దరఖాస్తు చేసుకోవాలి. https://www.rishinikam-kalakari.com అనే ఈ లింక్‌ను ఓపెన్ చేయండి.

## మరో రెండు నెలలు జాగ్రత్తగా ఉండండి: ఎయిమ్స్ డైరెక్టర్ గులేరియా




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:భారత్ లో కరోనా వైరస్ సెకండ్ వేవ్ ఇంకా కొనసాగుతోంది. థర్డ్ వేవ్ హెచ్చరికలను కూడా వైద్య నిపుణులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని ఎయిమ్స్ డైరెక్టర్ రణదీప్ గులేరియా వ్యాఖ్యలు చేశారు. వచ్చే 6 నుంచి 8 వారాల పాటు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ జాగ్రత్తలు పాటిస్తేనే మనం మహమ్మారి నుంచి బయటపడి మునుపటి పరిస్థితికి వెళ్లొచ్చని చెప్పారు. మహమ్మారి ఇంకా పూర్తిగా పోలేదని అన్నారు. ముఖ్యంగా పండుగల సీజన్ లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు.

వ్యాక్సిన్ తీసుకున్నవారు కూడా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. టీకా తీసుకున్న వారికి ఒకవేళ కరోనా సోకినా అది తేలికపాటి దశకే పరిమితమవుతుందని చెప్పారు. వ్యాక్సిన్ అనేది రోగం తీవ్రతరం కాకుండా చూస్తుందని తెలిపారు. కరోనా మహమ్మారి ప్రస్తుతం తిరోగమనంలో సాగుతోందని? ఇలాంటి సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని హెచ్చరించారు. మళ్లీ కేసుల సంఖ్య పెంచే పరిస్థితిని తీసుకురాకూడదని అన్నారు. అందరూ మాస్కులు ధరించాలని, ఎక్కువ మంది ఒకే చోట గుమ్మి కూడా కూడదని చెప్పారు.

# ఐరాసలో పాకిస్థాన్‌కు దిమ్మదిరిగే కౌంటర్ ఇచ్చిన భారత్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో కశ్మీర్ అంశాన్ని పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ప్రస్తావించడంతో భారత్ దీటుగా కౌంటర్ ఇచ్చింది. పాక్ ప్రధాని చేసిన వ్యాఖ్యలకు యూఎన్‌లోని భారత ప్రతినిధి స్నేహ దూబే తీవ్రంగా ఖండించారు. జమ్మూకశ్మీర్, లడాఖ్‌లు ఎప్పటికీ భారత్ లోనే భాగమని ఆమె స్పష్టం చేసింది. జమ్మూకశ్మీర్, లడాఖ్‌లను భారత్ నుంచి ఎవరూ వేరు చేయలేరని తేల్చి చెప్పారు. ఉగ్రవాదులకు పాకిస్థాన్ అడ్డాగా మారుతోందని ఆరోపించారు. ఉగ్రవాదులను పాక్ పెంచి పోషిస్తోందని తెలిపారు.

ఉగ్రవాదులకు మద్దతివ్వడం, సహకరించడం, ఆశ్రయం కల్పించడంలో పాకిస్థాన్ పాత్ర గురించి ఐరాసలో సభ్యదేశాలకు తెలుసు అని వ్యాఖ్యానించారు. బహిరంగంగా ఉగ్రవాదులకు మద్దతు, శిక్షణ, ఆర్థిక, ఆయుధాలు సమకూర్చడమనేది ప్రభుత్వ విధానంగా పెట్టుకున్న ఏకైక దేశం పాక్ అనేది ప్రపంచం గుర్తించిందని చెప్పారు. ఒసామా బిన్ లాడెన్‌కు పాకిస్థానే ఆశ్రయం ఇచ్చిందన్నారు. పాక్ అవలంబిస్తున్న విధానాల వల్లే ఉగ్రవాదులు రెచ్చిపోతున్నారని దూబే ఆరోపించారు.

# తెలంగాణ వ్యక్తికి ఆర్థిక సాయం చేసిన ఏపీ సీఎం జగన్



అమరావతి, సెప్టెంబర్ 25:తెలంగాణకు చెందిన పర్వతారోహకుడు అంగోతు తుకారామ్ కు ఏపీ ముఖ్యమంత్రి జగన్ అండగా నిలిచారు. తుకారామ్ సాహసాలను మెచ్చుకున్న జగన్? అతనికి భారీ ఆర్థికసాయాన్ని అందించారు.

తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జగన్ ను తుకారామ్ కలిశాడు. తన పర్వతారోహణ వివరాలను సీఎంకు వివరించాడు. ఈ సందర్భంగా తుకారామ్ ను జగన్ అభినందించారు. ఆయనకు రూ. 35 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా తుకారామ్ మాట్లాడుతూ, తనపై జగన్ చూపిన ఆదరాభిమానాలకు, చేసిన ఆర్థిక సాయానికి జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పాడు.

# మహారాష్ట్రలో అక్టోబర్ 22న తెరుచుకోనున్న థియేటర్లు

ముంబై, సెప్టెంబర్ 25:: కరోనా కేసులు తగ్గుముఖం పట్టడంతో మహారాష్ట్ర కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అక్టోబర్ 22 నుంచి కొవిడ్ నిబంధనలు పాటిస్తూ అక్టోబర్ 22 నుంచి సినిమా థియేటర్లను తిరిగి ఓపెన్ చేసేందుకు అనుమతిస్తామని సీఎం ఉద్ధవ్ ఠాక్రే కార్యాలయం ప్రకటించింది. ఇక అక్టోబర్ 7 నుంచి మహారాష్ట్రలో అన్ని ప్రార్థనాలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలను తెరిచేందుకు అనుమతించనున్నట్టు ముఖ్యమంత్రి కార్యాలయం ఇప్పటికే వెల్లడించింది. కాగా, కొవిడ్-19 సెకండ్ వేవ్ విరుచుకుపడటంతో మూతపడిన దేవాలయాలు, ప్రార్థనాలయాలను తెరవాలని బీజేపీ గత కొంతకాలంగా డిమాండ్ చేస్తోంది.





# 'గంగానది సమగ్ర పునరుజ్జీవనం'లో మెరుగైన సమన్వయం, అభిసరణకు జలశక్తి శాఖ సహాయ మంత్రి అధ్యక్షతన సాధికారిత టాస్క్ ఫోర్స్ సమావేశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:గంగా నది మరియు దాని పరివాహక ప్రాంతం యొక్క సంపూర్ణ పునరుజ్జీవనం కోసం పని చేస్తున్న ఏజెన్సీలు, కార్యక్రమాల మధ్య మెరుగైన సమన్వయం మరియు అనుసరణకు గాను వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు రాష్ట్ర ప్రభుత్వాలతో సహా ఏర్పాటు చేసిన సాధికారిత టాస్క్ ఫోర్స్ సమావేశానికి కేంద్ర జలశక్తి సహాయ మంత్రి శ్రీ బిశ్వేశ్వర్ తుడు అధ్యక్షత వహించారు. నిన్న జరిగిన ఈ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. మంత్రిత్వ శాఖలు మరియు రాష్ట్రాలు ఇటీవలి పరిణామాలపై తాజా స్థితిని గురించి తెలియజేశారు. వారి భవిష్యత్తు ప్రణాళికలను కూడా రూపొందించి అందించాయి. సమావేశానికి హాజరైన మంత్రిత్వ శాఖలలో వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ అధికారులు మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయం మరియు వ్యవసాయ - అటవీ సంరక్షణ విస్తీర్ణం 23,840 హెక్టార్ల నుండి 1,03,780 హెక్టార్లకు పెరిగినట్టుగా తెలియజేసింది. ఇందులో ఉత్తరాఖండ్‌లో సేంద్రీయ వ్యవసాయ భూమి 50,840 హెక్టార్లకు, ఉత్తరప్రదేశ్ 42,180 హెక్టార్లకు, బీహార్‌లలో 16,060 హెక్టార్లు, జార్ఖండ్‌లో 4,540 హెక్టార్లకు చేరింది. సేంద్రీయ వ్యవసాయానికి మారడం రైతుల ఆదాయాన్ని పెంచడానికి, నీటి వినియోగాన్ని మెరుగుపరచడానికి మరియు పంట వైవిధ్యతను మెరుగుపరచడానికి వ్యవసాయ మంత్రిత్వ శాఖ కృషి చేస్తోంది. గంగా నది వెంట సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల కోసం రాష్ట్రాలు నమామి గంగే బ్రాండ్‌ను కూడా ఉపయోగిస్తున్నాయి. హరిద్వార్‌లోని గంగా మ్యూజియం ఇప్పటికే పనిచేస్తోంది. హృషికేష్‌లో మ్యూజియం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని, పాట్నాలోని మరొక మ్యూజియం కూడా మంజూరు చేయబడిందని పర్యాటక మంత్రిత్వ శాఖ తెలియజేసింది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ మరియు బీహార్‌లలోని గంగానదిలో పర్యాటకుల సర్క్యూట్‌లను అభివృద్ధి చేయడానికి గాను మంత్రిత్వ శాఖ కృషి చేస్తోంది. 38 జిల్లాలకు సంబంధించిన నిర్మాణ, సాంస్కృతిక మరియు సహజ మ్యాపింగ్‌పై నివేదిక కూడా సమర్పించారు. రాష్ట్రాలలో, బీహార్ వారి 'స్టేట్ ఆర్గానిక్ మిషన్' సేంద్రీయ ఉత్పత్తుల ఉత్పత్తి మరియు మార్కెటింగ్‌ను ప్రోత్సహించడానికి కట్టుబడి ఉంది. ఉత్తర్ ప్రదేశ్ సేంద్రీయ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి ప్రజలను ప్రోత్సహించడానికి పట్టణ ప్రాంతాల్లో సేంద్రీయ తోటల పెంపకం ఉ పట్టణ నివాస కాలనీలలో మండీలను (ఔట్‌లెట్‌లను) అభివృద్ధి చేయడానికి కృషి చేస్తోంది. ఉత్తరాఖండ్ చార్ ధామ్ యాత్రలో సేంద్రీయ ఉత్పత్తులను ప్రోత్సహించడానికి 20 పెద్ద మరియు 410 చిన్న అవుట్‌లెట్‌లను ప్రారంభించింది, జార్ఖండ్ ప్రభుత్వం ముఖ్యంగా గంగానదిలో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి 'జార్ఖండ్ సేంద్రీయ వ్యవసాయ ప్రాధికారికత' సంస్థను ప్రారంభించింది.

పశ్చిమ బెంగాల్ రాష్ట్రం సుందర్‌బన్ ప్రాంతంలో భారీ ప్లాంటేషన్ డ్రైవ్‌ను ప్రారంభించింది. 10,000 ఎకరాల భూమిలో 3 జిల్లాలలో 15 కోట్ల మొక్కలను నాటింది. ఈ సమావేశంలో జల శక్తి శాఖ సహాయ మంత్రి శ్రీ బిశ్వేశ్వర్ తుడు మాట్లాడుతూ 'నమామి గంగే' గంగా నదిని శుభ్రపరిచే కార్యక్రమం మాత్రమే కాదని, ప్రజలలో సామూహిక చైతన్యాన్ని తీసుకువస్తుందని అన్నారు. అందువల్ల, కేంద్ర మరియు రాష్ట్ర మంత్రిత్వ శాఖలన్నీ ఒకే గొడుగు కిందకు వచ్చి గంగా అవిరాల్ మరియు నిర్మల్‌గా మార్చేందుకు కృషి చేయాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ పంకజ్ కుమార్, ఎన్ఎంసీజీ సంస్థ డీజీ శ్రీ రాజీవ్ రంజన్ మిశ్రా, ఎన్ఎంసీజీ ఈడీ (ఫైనాన్స్) శ్రీ రోజీ అగర్వాల్, ఎన్ఎంసీజీ ఈడీ (ప్రాజెక్ట్స్) శ్రీ అశోక్ కుమార్ సింగ్, ఎన్ఎంసీజీ ఈడీ (టెక్నికల్) శ్రీ డి.పి. మాథూరియాలు సమావేశంలో నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా కార్యక్రమానికి ప్రాతినిధ్యం వహించారు.

# విద్యా సంస్థలకు పేటెంట్ ఫీజు 80% మేరకు తగ్గింపు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:ఆత్మ నిర్బర్ భారత్ సాధన దిశలో భాగంగా పేటెంట్ దాఖలు, కొనసాగింపుకు ఇస్తున్న 80% తగ్గించిన ఫీజు రాయితీ సౌకర్యాన్ని విద్యా సంస్థలకు కూడా వర్తింపు చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీనికి సంబంధించి పేటెంట్ నిబంధనలకు సవరణలను కేంద్రం విడుదల చేసింది.

విజ్ఞాన రంగంలో ఆవిష్కరణలు,సృజనాత్మకతకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించిన ప్రభుత్వం ఇటీవల కాలంలో ఈ అంశానికి ప్రాధాన్యత ఇస్తోంది. కేంద్రం అమలు చేస్తున్న విధానాల వల్ల దేశంలో విజ్ఞాన రంగంలో ఆవిష్కరణలు,సృజనాత్మకత పెరుగుతున్నాయి. పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య సమన్వయం సాధించడానికి పరిశ్రమ మరియు అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ కృషి చేస్తోంది. విద్యాసంస్థలలో పరిశోధనల వాణిజ్యీకరణను చేయడం ద్వారా రెండు రంగాల మధ్య సమన్వయం సాధించడానికి అవకాశం కలుగుతుంది.

విద్యాసంస్థలలో సాగుతున్న పరిశోధనా కార్యక్రమాల్లో భాగంగా ప్రొఫెసర్లు/ ఉపాధ్యాయులు, విద్యార్థులు అనేక నూతన ఆవిష్కరణలకు రూపకల్పన చేస్తున్నారు. వీటిని వాణిజ్య పరంగా అభివృద్ధి చేయడానికి ఆవిష్కరణలకు పేటెంట్ పొందాల్సి ఉంటుంది. అయితే, పేటెంట్ పొందడానికి ఎక్కువ మొత్తంలో రుసుమును చెల్లించవలసి ఉండడంతో తమ ఆవిష్కరణలకు పేటెంట్లను తీసుకోవడానికి వెనుకడుగు వేయవలసి వస్తోంది. నూతన సాంకేతికతల అభివృద్ధిలో అధిక రుసుములు ప్రధాన ప్రతిబంధకంగా ఉంటున్నాయి.

తమ ఆవిష్కరణలకు పేటెంట్ పొందడానికి సంస్థ తరఫున వీటిని ఆవిష్కరించిన వారు దరఖాస్తు చేయవలసి ఉంటుంది. దరఖాస్తుతో పాటు ఎక్కువ మొత్తంలో ఫీజును చెల్లించవలసి ఉంటుంది. దీనితో ఈ సంస్థలు పేటెంట్ల విషయంలో వెనుకడుగు వేయవలసి వస్తోంది. దేశ ఆవిష్కరణల రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న విద్యా సంస్థలను ప్రోత్సహించడానికి పేటెంట్లను పొందడానికి చెలించవలసి ఉన్న ఫీజులను తగ్గిస్తూ పేటెంట్ నిబంధనలు 2003లో సవరణలు చేస్తూ ప్రభుత్వం పేటెంట్స్( సవరణ) నిబంధనలు 2021 ని విడుదల చేసింది. నూతన నిబంధనలు 2021 సెప్టెంబర్ 21 వ తేదీ నుంచి అమలు లోకి వచ్చాయి.

దరఖాస్తుల ప్రాసెసింగ్‌లో విధానపరమైన అసమానతలు మరియు అనవసరమైన దశలను తొలగించాలన్న లక్ష్యంతో 2016, 2017, 2019 మరియు 2020 లో పేటెంట్ నియమాలలో సవరణలను చేయడం జరిగింది. వీటివల్ల ధరఖాస్తులను వేగంగా పరిశీలించి అనుమతులను మంజూరు చేయడానికి అవకాశం కలుగుతుంది. నిబంధనలను సవరించడం వల్ల ప్రక్రియలు సమగ్రంగా, నిర్ణీత వ్యవధిలో పూర్తి అయ్యేలా ఇ-లావాదేవీలకు అనుకూలంగా ఉంటాయి. దీనికి సంబంధించి, ఈ క్రింది కార్యక్రమాలను మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్నది.

-కొత్త ఎగ్జామినర్లను నియమించడం ద్వారా మానవ వనరులను పెంచడం.

- పేటెంట్ దరఖాస్తుల స్వీకరణ ,మంజూరుకు పూర్తి ఆన్‌లైన్ విధానం అమలు

-వీడియో-కాన్ఫరెన్సింగ్ ద్వారా పేటెంట్ల కేసులను వేగంగా మానవ సంబంధం లేకుండా విచారించడం .

-సంబంధిత వర్గాలకు తాజా ఐపి సమాచారాన్ని అందించడానికి వెబ్‌సైట్ ను అభివృద్ధి చేసి అవాంతరం లేకుండా పనిచేయడానికి చర్యలు

-ఎటెంట్లను పొందడానికి వర్తింపజేయడానికి మరియు మంజూరు చేయడానికి డిజిటల్ ప్రక్రియను ప్రోత్సహించడం.

-స్టార్టప్‌ల( అంకుర సంస్థలు) దరఖాస్తుల దాఖలు, ప్రాసెసింగ్ కోసం సహాయ సహకారాలను అందించడానికి మేధోపరమైన ఆస్తి రక్షణ పథకం ప్రారంభించబడింది. సహాయ సహకారాలను అందించిన వారికి చెల్లించే ప్రొఫెషనల్ ఛార్జీలు నిబంధనల ప్రకారం తిరిగి చెల్లించబడతాయి.

-ఐపీ కార్యాలయాల పనితీరుకి సంబంధించిన సమస్యలకు సంబంధించి ఫీడ్‌బ్యాక్/సూచనలు/ఫిర్యాదులను స్వీకరించడానికి ఐపీవో వెబ్‌సైట్‌లో వ్యవస్థ ఏర్పాటు చేయబడింది. ఒక బృందం సూచనలు/ఫిర్యాదులపై తక్షణమే స్పందించి ఇ-మెయిల్ ద్వారా తగిన ప్రతిస్పందనను తెలియజేస్తుంది.

-సంబంధిత వర్గాలకు ఐపీర్ ప్రమోషన్ మరియు మేనేజ్‌మెంట్ సెల్ ద్వారా అందించడానికి సీజీపీడీటిఎం కార్యాలయం సహకారంతో డీపీఐఐటీ అందిస్తోంది. పరిశ్రమల సంఘాలు, నిబంధనలను అమలు చేసే సంస్థల సహకారంతో నిర్వహించే అవగాహన కార్యకలాపాలలో పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు పాల్గొనేలా ప్రోత్సహించడం జరుగుతోంది.

ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నూతన విధానాల వల్ల పేటంట్ల అందిన దఖాస్తుల పరిశీలనా సమయం గణనీయంగా తగ్గింది. సాంకేతిక రంగాలపై ఆధారపడి ఈ ప్రక్రియ పూర్తి కావడానికి 2015 లో సగటు 72 నెలల సమయం పట్టేది. ప్రస్తుతం ఇది 12-30 నెలలలో పూర్తవుతుంది పేటెంట్ దరఖాస్తులపై తుది నిర్ణయాన్ని తీసుకోవడానికి ఇది వరకు కొన్ని సంవత్సరాలు పట్టేది. ప్రస్తుతం ఇది సగటున 48 నెలలకు తగ్గింది. 2021 చివరి నాటికి దాఖలు చేసినప్పటి నుండి సగటు 24-30 నెలలకు ఈ సమయం తగ్గించబడుతుంది. దీనితో వేగవంతమైన పరీక్ష విధానం కూడా అమలులోకి వచ్చింది. సాధారణ విధానంతో పోల్చి చూస్తే ఈ విధానంలో ఒక సంవత్సరంలోపే పేటెంట్ మంజూరు కోసం అందిన దరఖాస్తు పై తుది నిర్ణయం తీసుకోవడానికి అవకాశం ఉంటుంది.

అభ్యర్థనను దాఖలు చేసిన 41 రోజులలో అత్యంత వేగంగా పేటెంట్ మంజూరు చేయబడింది. స్టార్టప్‌లు దాఖలు చేసిన పేటెంట్ దరఖాస్తుల కోసం తొలుత ఈ వేగవంతమైన పరీక్షా వ్యవస్థ సౌకర్యం ప్రారంభించబడింది. 17-09-2019 నుంచి అమల్లోకి వచ్చిన పేటెంట్ నియమాల సవరణలు ద్వారా ఇది మరో 8 వర్గాలకు విస్తరించబడింది ఎస్ఎంఈ , మహిళా దరఖాస్తుదారులు, ప్రభుత్వ విభాగాలు, కేంద్ర, ప్రొవిన్షియల్ లేదా రాష్ట్ర చట్టం ద్వారా స్థాపించబడి ప్రభుత్వ రంగ నిర్వహణ లేదా నియంత్రణలో ఉన్న సంస్థలు, ప్రభుత్వం లేదా పేటెంట్స్ ప్రాసిక్యూషన్ హైవే కింద అందే దరఖాస్తులకు ఈ సౌకర్యం వర్తిస్తుంది. . స్టార్టప్ ఇండియా కార్యక్రమానికి సంబంధించి స్టార్టప్‌లు దాఖలు చేసిన పేటెంట్ దరఖాస్తులకు 80% ఫీజు రాయితీ అందించబడింది.

# "బొగ్గు మరియు గనుల" పై జరిగిన మొదటి ఇండియా-ఆస్ట్రేలియా జాయింట్ వర్కింగ్ గ్రూప్ (జేబ్ల్యూజి) వర్చువల్ సమావేశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:2021 అక్టోబర్ 13 న జరగబోతున్న ఇండియా-ఆస్ట్రేలియా ఎనర్జీ డైలాగ్‌కు ముందస్తుగా, భారత్ - ఆస్ట్రేలియా మధ్య "బొగ్గు మరియు గనుల" పై మొదటి జాయింట్ వర్కింగ్ గ్రూప్ (జేబ్ల్యూజి) సమావేశం ఈరోజు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఇక్కడ జరిగింది. భారతదేశం



నుండి బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ వినోద్ కుమార్ తివారీ మరియు ఆస్ట్రేలియా వైపు నుండి వనరుల విభాగం అధిపతి శ్రీ పాల్ ట్రాట్మన్ సహ అధ్యక్షత వహించారు.

తన ప్రారంభ ప్రసంగాలలో శ్రీ తివారీ భారతదేశంలో బొగ్గు రంగం గురుంచి అవలోకనాన్ని అందించారు. భవిష్యత్తు కోసం అభివృద్ధి చెందుతున్న దృష్టాంతాన్ని అందించారు. రెండు దేశాలలో బొగ్గు మరియు మైనింగ్ రంగాలలో సాధ్యమయ్యే సహకారం కోసం చేర్చాల్సిన ప్రాధాన్యత ప్రాంతాలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

ప్రస్తుత మరియు భవిష్యత్తు పరిస్థితులు, భారతీయ బొగ్గు వనరులు, క్లిష్టమైన మరియు వ్యూహాత్మక ఖనిజాలు-డిమాండ్ మరియు సరఫరా స్థితిగతులు ఈ సమావేశంలో చర్చించారు. క్లీన్ కోల్ టెక్నాలజీపై ఇండియా ఆస్ట్రేలియా సహకారం, ఉపరితల బొగ్గు గ్యాసిఫికేషన్, కోల్ బెడ్ మీథేన్, సాంకేతికత భాగస్వామ్యం కోసం చర్చలలో ప్రధానంగా అంశాలు చోటుచేసుకున్నాయి. ఫైర్ క్వెన్చింగ్, బొగ్గు ఆధారిత హైడ్రోజన్, కార్బన్ క్యాప్చర్ యుటిలైజేషన్ ఉ స్టోరేజ్ (సిసియుఎస్) పై సమాలోచనలు జరిగాయి. బొగ్గు టెక్నాలజీపై వ్యాపారం నుండి వ్యాపార సహకారం, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణపై సహకారం, ఆస్ట్రేలియా నుండి కోకింగ్ బొగ్గు దిగుమతికి సంబంధించిన అంశాలపై వీరి మధ్య చర్చ జరిగింది.

భవిష్యత్తులో ఏదైనా సహకారం కోసం ఈ అంశాలపై తమ నైపుణ్యాన్ని పంచుకోవడం గురించి ఇరుపక్షాలు చర్చించాయి మరియు వనరులు, సాంకేతికత, సుస్థిరత మరియు వ్యాపార అవకాశాలపై భారత్ ప్రెజెంటేషన్ ఇచ్చింది. జాయింట్ సెక్రటరీ శ్రీమతి విస్మితాతేజ్, బొగ్గు మంత్రిత్వ శాఖ సలహాదారు శ్రీ ఆనంది ప్రసాద్, కబిల్ సిఎండి శ్రీ రంజిత్‌రాథ్, సిఐఎల్ చీఫ్ మేనేజర్ శ్రీ పీయూష్ కుమార్ మరియు సిఎమ్‌పిడిఐఎల్ డైరెక్టర్ శ్రీ ఎకె రాణా ఈ ప్రెజెంటేషన్లు ఇచ్చారు. గ్లోబల్ రిసోర్సెస్ స్ట్రాటజీ, ఎనర్జీ ఉ ఇండస్ట్రీ, కార్బన్ క్యాప్చర్ యుటిలైజేషన్ అండ్ స్టోరేజ్ (సిసియుఎస్) మరియు ట్రేడ్ అండ్ కమోడిటీ రిలేషన్‌ని డీకార్బోనైజ్ చేయడానికి గ్లోబల్ రిసోర్సెస్ స్ట్రాటజీ, లెవరేజింగ్ టెక్నాలజీస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై ఆస్ట్రేలియన్ వైపు నుండి ప్రెజెంటేషన్‌లు ఇచ్చారు. ఈ సందర్భంగా ఓపెన్ హౌస్ చర్చ కూడా జరిగింది.

## ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో వక్తృత్వ, వ్యాస రచన,పెంటింగ్ పోటీల నిర్వహణ..!

**-విజేతలను ఎంపిక చేసినట్లు తెలిపిన జిల్లా రెవిన్యూ అధికారి రాధిక రమణి.**

సంగారెడ్డి , సెప్టెంబర్ 25 (నేటినిజం ప్రతినిధి) ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో వక్తృత్వ, వ్యాస రచన,పెంటింగ్ పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేసినట్లు జిల్లా రెవిన్యూ అధికారి రాధిక రమణి తెలిపారు.

శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో విద్యార్థులకు జూనియర్ సీనియర్ విభాగాలలో వక్తృత్వ, వ్యాస రచన, పెయింటింగ్ పోటీలను నిర్వహించామన్నారు. ఆయా విభాగాలలో సుమారు వందకు పైగా విద్యార్థులు పాల్గొన్నారని, అందులో మొత్తం 24 మంది విజేతలుగా నిలిచారని ఆమె తెలిపారు. ఆయా విభాగాల్లో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులకు విజేతలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

# ఏపీలో మూడు రోజులు భారీ వర్షాలు



అమరావతి, సెప్టెంబర్ 25:తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఆదివారం నాటికి తుఫానుగా మారనుందని వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే 24 గంటల్లో పశ్చిమ వాయువ్యంగా పయనించి, దక్షిణ ఒడిశాలోని గోపాల్‌పూర్, ఏపీలోని విశాఖపట్నం మధ్య? కళింగపట్నానికి సమీపాన తీరం దాటుతుందని వెల్లడించింది. దీని ప్రభావంతో శనివారం నుంచి కోస్తాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఆదివారం అక్కడక్కడా అతి భారీగా వర్షాలు కురుస్తాయని తెలిపింది. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కోస్తా తీరం వెంబడి గంటలకు 50-60 కి.మీ.వేగంతో బలమైన గాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరించారు.

# వైద్యారోగ్య రంగంపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు



ముంబై , సెప్టెంబర్ 25: వైద్యారోగ్య రంగంపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు వ్యాఖ్యలు చేశారు. దేశానికి కనీసం 600 మెడికల్ కాలేజీలు, 50 ఎయిమ్స్ లాంటి సంస్థలు, 200 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ఆవసరం ఉందని నితిన్ గడ్కరీ అన్నారు. పబ్లిక్, ప్రయివేటు భాగస్వామ్యంతో ఆరోగ్య, విద్యా రంగంలో మౌలిక సదుపాయాల కల్పన జరగాలన్నారు.

మహారాష్ట్ర సతారా జిల్లాలోని కరాడ్ సిటీలో కొవిడ్ వారియర్స్‌ను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సన్మానించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. మెడికల్ సదుపాయాల కల్పన కోసం కోఆపరేటివ్ సెక్టార్ ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ఒకసారి ప్రధాని మోదీతో చర్చ జరిగినప్పుడు.. వెంటిలేటర్ల కొరత గురించి చెప్పాను. దేశంలో ప్రస్తుతం ఎన్ని వెంటిలేటర్లు ఉన్నాయని మోదీ తనను ప్రశ్నించారని గడ్కరీ చెప్పారు. 2.5 లక్షల వెంటిలేటర్లు ఉండాలని, ఆ మేరకు అవసరం ఉందని తాను ప్రధానికి చెప్పాను. కానీ కరోనా ఉధృతంగా ఉన్న సమయంలో కేవలం 13 వేల వెంటిలేటర్లు మాత్రమే దేశంలో ఉన్నాయని మోదీ చెప్పారని గడ్కరీ తెలిపారు.

కరోనా సమయంలో ఆక్సిజన్ కొరతతో పాటు బెడ్లు, ఇతర మెడికల్ సదుపాయాల కొరత ఉన్నట్లు పేర్కొన్నారు. కానీ డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది, నర్సులు తమ విలువైన సమయాన్ని కరోనా రోగులకు కేటాయించి, వారి ప్రాణాలను కాపాడారని కేంద్ర మంత్రి ప్రశంసించారు. దేశానికి కనీసం 600 మెడికల్ కాలేజీలు, 50 ఎయిమ్స్ లాంటి సంస్థలు, 200 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ఆవసరం ఉందని నితిన్ గడ్కరీ అన్నారు. అలాగే ప్రతి తహసీల్ పరిధిలో ఒక వెటర్నరీ హాస్పిటల్ ఉండాలని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.


ఆహ్వానం
దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేదిక
కుడికాల వంశీధర్ రచించిన
సాఫ్ట్‌వేర్‌నానీలు పుస్తక ఆవిష్కరణ
ZOOM
2021 సెప్టెంబర్ 25 శనివారం
సా. 5 గంటలకు



ముఖ్య అతిథి & ఆవిష్కర్త
డా. ఎన్. గోపి
కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కార గ్రహీత

సభాధ్యక్షులు
శ్రీ రాపోలు సీతారామరాజు
అధ్యక్షులు, దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేదిక

విశిష్ట అతిథులు
శ్రీ హర్షవర్ధన్ - కవి, రచయిత
డా. తలతోటి పృథ్వి రాజ్ - కవి, విమర్శకులు
డా. ఎస్. రఘు - అసిస్టెంట్ ప్రొఫెసర్, ఉస్మానియా యూనివర్సిటీ

గౌరవ అతిథులు
డా. సి. భవానీ దేవి - ప్రముఖ రచయిత్రి
శ్రీమతి ప్రత్తిపాటి సుభాషిణి - రచయిత్రి
శ్రీమతి ఉప్పల పద్మ - రచయిత్రి

పుస్తక సమీక్ష
డా. పోరెడ్డి రంగయ్య - అధ్యక్షులు, తేజ ఆర్ట్ క్రియేషన్స్
శ్రీ గౌతమ్ లింగా - కవి

స్వాగతం: శ్రీ సి.వి.శ్రీనివాస్
వందన సమర్పణ: శ్రీ వెన్నెల సత్యం

# బధిరుల అంతర్జాతీయ వారోత్సవం -2021 , బధిరుల అభివృద్ధి ఉత్సవాల కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ కింద డైరక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ ఈ అంతర్జాతీయ బధిరుల వారోత్సవం -2021ని నిర్వహిస్తోంది. బధిరులకు సంబంధించి పలు అవగాహనా కార్యక్రమాలు, ఈ రంగంతో సంబంధం గల పలు స్టేక్ హోల్డర్లతో కార్యకలాపాలను నిర్వహిస్తున్నది. ఈ ఏడాది థీమ్, అభివృద్ధి చెందుతున్న బధిరుల కమ్యూనిటీల ఉత్సవం గా నిర్ణయించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ భారతి పవార్, దేశంలో వివిధ వినికిడి సమస్యలతో బాధపడే వారు 9 కోట్ల మంది వరకు ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం మనం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ జరుపుకుంటున్న నేపథ్యంలో మనం మన గ్రామాలకు వెళ్లి, చిన్న పిల్లలకు గల వివిధ అనారోగ్యాలపై పరీక్షలు నిర్వహింపచేయాలన్నారు. ప్రాథమిక దశలో వీటిని గుర్తించడం వల్ల వైకల్యం ఏర్పడకుండా నివారించవచ్చని ఆమె అన్నారు. దీనివల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. వివిధ అనారోగ్యాలు, వివిధ వైకలయాలకు సంబంధించి చిన్నపిల్లలకు పరీక్షలు నిర్వహింప చేయడం తప్పనిసరి అని, చికిత్స కంటే రోగం రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమని అన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ దార్శనికతకు కృతజ్ఞతలు తెలియజేస్తూ డాక్టర్ భారతి పవార్, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీజీ నాయకత్వంలో , భారతదేశం తనంత తానుగా ఔషధాన్ని తయారు చేయగలదని, రోజుకు 1 నుంచి 2 కోట్ల వరకు వాక్సిన్‌లు వేయగల సమర్థత కలిగి ఉందని ప్రపంచానికి చాటి చెప్పగలిగిందని అన్నారు.

పుట్టిన రోజు వేడుకల సమయంలో వినికిడి లోపం ఉన్న వారికి తమ పుట్టిన రోజు కానుకగా వినికిడి సమస్యను తీర్చే ఉపకరణాలను అవసరమైన వారికి బహుకరించాల్సిందిగా ఆమె పిలుపునిచ్చారు.

తన చిన్ననాటి ఉదాహరణను ఒక దానిని ప్రస్తావిస్తూ ఆమె, పసిపిల్లల సంరక్షణకు సంబంధించి పాతకాలపు సంప్రదాయాలను పునరుద్ధరించాలన్నారు. గర్భిణుల సంరక్షణపట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. చిన్న పిల్లల ఆరోగ్య పరీక్షలు, చికిత్సకు సంబంధించి వివిధ హెల్ప్‌లైన్ల విషయమై క్యుఆర్ కోడ్‌తో చిన్న పాకెట్ బుక్‌లెట్ రూపొందించనున్నట్టు ఆమె తెలిపారు. ఈ పాకెట్ బుక్‌ను ఆషా, అంగన్‌వాడి వర్కర్లు, ఇతర ఆస్పత్రి సిబ్బంది వినియోగించుకోవచ్చన్నారు. ఆయుష్మాన్ భారత్ వంటి వివిధ ప్రభుత్వ పథకాల గురించి ప్రజలలో అవగాహన కల్పించాలని , దీనివల్ల ప్రజలు మరింత ప్రయోజనం పొందడానికి అవకాశం కలుగుతుందని అన్నారు.

బధిరుల అంతర్జాతీయ వారోత్సవాన్ని తొలుత 1958లో ఇటలీలోని రోమ్‌లో ప్రారంభించారు. గ్లోబల్ డెఫ్ కమ్యూనిటీ దీనిని ప్రతి ఏటా సెప్టెంబర్‌లో నిర్వహిస్తోంది. ప్రపంచ బధిరుల ఫెడరేషన్ తొలి ప్రపంచ కాంగ్రెస్ జరిగిన నెలలోనే దీనిని జరుపుతూ వస్తున్నారు. అంతర్జాతీయ బధిరుల వారోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా బధిరులకు సంబంధించిన పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

డిజిహెచ్ ఎస్ డాక్టర్ సునీల్ కుమార్, ప్రిన్సిపల్ కన్సల్టెంట్ డిజిహెచ్ ఎస్ డాక్టర్ కన్వర్ సేన్, డిడిజి , డిజిహెచ్‌ఎస్ డాక్టర్ అనిల్ కుమార్, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖకు చెందిన ఇతర సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఐఏఎఫ్ అవసరాల కోసం '56 సీ-295ఎండబ్ల్యు' రవాణా విమానాల కొనుగోలుకు ఎయిర్‌బస్ డిఫెన్స్ & స్పేస్ స్పెయిన్‌తో ఎంఓడీ ఒప్పందం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:భారత వైమానిక దళం అవసరాల కోసం '56 సీ-295 ఎండబ్ల్యు' రవాణా విమానాల కొనుగోలుకు గాను మెస్సర్స్ ఎయిర్‌బస్ డిఫెన్స్ అండ్ స్పేస్, స్పెయిన్‌తో రక్షణ మంత్రిత్వ శాఖ (ఎంఓడీ) సెప్టెంబర్ 24, 2021న ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా రక్షణ మంత్రిత్వ శాఖ మెస్సర్స్ ఎయిర్‌బస్ డిఫెన్స్ మరియు స్పేస్‌తో ఆఫ్‌సెట్ కాంట్రాక్టుపై సంతకం చేసింది. దీని ద్వారా మెస్సర్స్ ఎయిర్‌బస్ భారతీయ ఆఫ్‌సెట్ భాగస్వాముల నుండి అర్హత కలిగిన ఉత్పత్తులుసేవలను నేరుగా కొనుగోలు చేయడం ద్వారా ఆఫ్‌సెట్ బాధ్యతల్ని నిర్వర్తిస్తుంది.

ఈ నెల ప్రారంభంలో భద్రతపై కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపిన తరువాత ఈ ఒప్పందంపై సంతకాలు చేయబడ్డాయి. భారతీయ వైమానిక దళం (ఐఏఎఫ్) యొక్క రవాణా సముదాయాల ఆధునీకరణ దిశగా సీ-295ఎండబ్ల్యుని ప్రవేశపెట్టడం ఒక ముఖ్యమైన అడుగు. ఇది సమకాలీన టెక్నాలజీతో 5-10 టన్నుల సామర్థ్యం కలిగిన రవాణా విమానం. ఇది ఐఏఎఫ్ యొక్క అవ్రో రవాణా విమానాల స్థానాన్ని భర్తీ చేస్తుంది. విమానం సెమీ-ప్రిపేర్ చేసిన స్ట్రిప్‌ల నుండి పనిచేసే సామర్థ్యం కలిగి ఉంటుంది. దీనికి తోడు త్వరిత గతిన ప్రతిచర్య మరియు సైనిక దళాలు మరియు సరుకును జారవిడిచేందుకు వెనుక ర్యాంప్ తలుపును కూడా కలిగి ఉంటుంది. ముఖ్యంగా ఉత్తర భారతం, ఈశాన్య భారతం సెక్టార్, అండమాన్ నికోబార్ దీవులలో ఐఏఎఫ్ వ్యూహాత్మక ఎయిర్ లిఫ్ట్ సామర్థ్యానికి ఈ కొత్త విమానం పెద్ద ప్రోత్సాహాన్ని అందిస్తుంది.

ఈ ప్రాజెక్ట్ ప్రభుత్వం యొక్క 'ఆత్మనిర్భర్ భారత్ అభియాన్'కు భారీ ప్రోత్సాహాన్ని అందిస్తుంది, ఇది భారతీయ ప్రైవేట్ రంగానికి టెక్నాలజీ తీవ్రత , అత్యంత పోటీతత్వ విమానయాన పరిశ్రమ రంగంలో ప్రవేశించడానికి ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని అందిస్తుంది. మొత్తం 56 విమానాలలో నలభై విమానాలను టాటా కన్సార్టియం భారతదేశంలో తయారు చేస్తుంది.

ఒప్పందంపై సంతకం చేసిన పదేండ్లలో ఈ విమానాల డెలివరీ పూర్తవుతుంది. మొత్తం 56 విమానాలు స్వదేశీ ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సూట్‌తో నిర్మించబడుతాయి. డెలివరీ పూర్తయిన తర్వాత, భారతదేశంలో తయారు చేయబడిన తదుపరి విమానాన్ని భారత ప్రభుత్వం ఆమోదించిన ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేయవచ్చు. ఈ ప్రాజెక్ట్ భారతదేశంలోని ఏరోస్పేస్ ఎకోసిస్టమ్‌కి గొప్ప ప్రేరణను అందిస్తుంది. దీంతో దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న అనేక ఎంఎస్ఎంఈలు కూడా విమాన భాగాల తయారీలో పాలు పంచుకోనున్నాయి. హ్యాంగర్లు, భవనాలు, అప్రాన్‌లు మరియు టాక్సీవేల రూపంలో ప్రత్యేక మౌలిక సదుపాయాల అభివృద్ధి కూడా ఇందులో భాగం కానుంది. ఈ కార్యక్రమం స్వదేశీ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి , 'మేక్ ఇన్ ఇండియా'ను పెంచడానికి ప్రభుత్వం చేపట్టిన ఒక ప్రత్యేక చొరవగా నిలువనుంది.





# 2021-22 ఆర్థిక సంవత్సరానికి స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు 47% వృద్ధిని నమోదు చేసింది

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:22.09.2021 నాటికి 2021-22 ఆర్థిక సంవత్సర ప్రత్యక్ష పన్ను వసూళ్ల గణాంకాలు నికర సేకరణలు రూ. 5,70,568 కోట్లు, అంతకు ముందు ఆర్థిక సంవత్సరం అంటే 2020-21 ఆర్థిక సంవత్సరం రూ. 3,27,174 కోట్లు అంటే 74.4%పెరుగుదలను సూచిస్తున్నాయి. నికర సేకరణ (22.09.2021 నాటికి) 2021-22 లో నికర సేకరణ రూ. 4,48,976 కోట్లు ఉన్నప్పుడు 2019-20 ఆర్థిక సంవత్సరంలో 27% వృద్ధిని నమోదు చేసింది.

నికర ప్రత్యక్ష పన్ను సేకరణ రూ. 5,70,568 కోట్లు (22.09.2021 నాటికి)లో కార్పొరేషన్ పన్ను (సిఐటి) రూ. 3,02,975 కోట్లు (రీఫండ్ నికర) మరియు వ్యక్తిగత ఆదాయపు పన్ను (పిఐటి) సహా సెక్యూరిటీ లావాదేవీ పన్ను (ఎస్టిటి) రూ. 2,67,593 కోట్లు (రీఫండ్ నికర) ఉన్నాయి.

2021-22 ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్నుల స్థూల సేకరణ (రీఫండ్‌ల కోసం సర్దుబాటు చేయడానికి ముందు) రూ. 6,45,679 కోట్లు, ఇది అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో సేకరణ రూ. 4,39,242 కోట్లు అంటే 47% వృద్ధిని నమోదు చేసుకున్నాయి. స్థూల సేకరణ (22.09.2021 నాటికి) 2021-22 లో స్థూల సేకరణ రూ.5,53,063 కోట్లు ఉన్నప్పుడు 2019-20 ఆర్థిక సంవత్సరంలో 16.75% వృద్ధిని నమోదు చేసింది.

కార్పొరేషన్ పన్ను (అమి) రూ. 3,58,806 కోట్లు మరియు భద్రతా లావాదేవీల పన్ను (ఎస్టిటి) తో సహా వ్యక్తిగత ఆదాయ పన్ను (ఖమి) రూ. 2,86,873 కోట్లు కలిపి మొత్తం స్థూల సేకరణ రూ. 6,45,679 కోట్లుగా నమోదయింది. మైనర్ హెడ్ వారీ సేకరణలో రూ.2,53,353 కోట్లు అడ్వాన్స్ పన్ను ఉంటుంది; రూ. 3,19,239 కోట్లు మూలంలో పన్ను తీసివేయబడింది ; స్వీయ మదింపు పన్ను రూ. 41,739 కోట్లు; రెగ్యులర్ అసెస్‌మెంట్ ట్యాక్స్ రూ. 25,558 కోట్లు; డివిడెండ్ పంపిణీ పన్ను రూ. 4,406 కోట్లు మరియు ఇతర మైనర్ హెడ్స్ కింద పన్ను రూ. 1383 కోట్లు.

2021-22 ఆర్థిక సంవత్సరం ప్రారంభ నెలలు చాలా సవాలుగా ఉన్నప్పటికీ, రెండవ త్రైమాసికంలో (1 జూలై, 2021 నుండి 22 సెప్టెంబర్, 2021 వరకు) అడ్వాన్స్ పన్ను సేకరణ 2021-22లో రూ. 1,72,071 కోట్లు, 2020-21 ఆర్థిక సంవత్సరంలో అడ్వాన్స్ పన్ను సేకరణ రూ. 1,13,571 కోట్లు నమోదయింది.

2021-22 ఆర్థిక సంవత్సరం మొదటి మరియు రెండవ త్రైమాసికంలో సంచిత అడ్వాన్స్ పన్ను వసూళు రూ. 22.09.2021 నాటికి రూ.2,53,353 కోట్లు, అడ్వాన్స్ టాక్స్ వసూళ్లు . మునుపటి ఆర్థిక సంవత్సరం అంటే 2020-21 సంబంధిత కాలానికి రూ. 1,62,037 కోట్లు, ఇది 56%(సుమారుగా) వృద్ధిని చూపుతుంది. ఇంకా, సంచిత అడ్వాన్స్ పన్ను వసూలు రూ. 22.09.2021 (2021-22 ఆర్థిక సంవత్సరం) నాటికి రూ.2,53,353 కోట్లు అడ్వాన్స్ టాక్స్ కలెక్షన్ (క్యుములేటివ్) రూ. 2,21,036 కోట్లు ఉన్నప్పుడు 2019-20 ఆర్థిక సంవత్సరంలో సంబంధిత కాలంలో 14.62% వృద్ధిని చూపించాయి. అడ్వాన్స్ పన్ను సేకరణ రూ. 22.09.2021 నాటికి 2,53,353 కోట్లు కార్పొరేషన్ పన్ను (సిఐటి) రూ. 1,96,964 కోట్లు, వ్యక్తిగత ఆదాయపు పన్ను (పిఐటి) రూ. 56,389 కోట్లు. బ్యాంకుల నుండి మరింత సమాచారం కోసం ఎదురుచూస్తున్నందున ఈ మొత్తం పెరుగుతుందని భావిస్తున్నారు.

మొత్తానికి రీఫండ్‌లు 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.75,111 కోట్లు కూడా జారీ చేయడం జరిగింది.

# ఇద్దరు వృద్ధురాళ్లను చేరదీసిన కార్పొరేటర్..టూ టౌన్ సీఐ..

## -అండగా నిలిచి.. అనాథాశ్రమంలో చేర్పించిన వైనం

కరీంనగర్ సెప్టెంబర్ 25:(నేటినిజం ప్రతినిధి): నగరంలోని 54వ డివిజన్ పరిధిలోని కశ్మీర్ గడ్డ ప్రాంతంలో ఉండటానికి ఇల్లు..తినడానికి తిండి.. ఆదుకునే వాళ్లు లేక ఇబ్బందులు పడుతున్న ఇదే ప్రాంతంలో గత కొన్నేళ్లుగా అనసూర్య.. జయమ్మ అనే ఇద్దరు వృద్ధురాళ్లను 54వ డివిజన్ కార్పొరేటర్ ఇఫ్రాతహ్సీన్-ఆతిన..టూ టౌన్ సీఐ తాత లక్ష్మీ బాబు లు అండగా నిలిచారు. శనివారం వీరిద్దరూ వృద్ధురాళ్లను హౌసింగ్ బోర్డు కాలనీలోని వీర బ్రహ్మేంద్ర అనాథాశ్రమంలో చేర్పించారు. జయమ్మ కు కుమారుడు..మనమడు ఇద్దరు మరణించారు. కోడలు..దివ్యఅంగురాలైన మనుమరాలు ఉంది. వీరికి ఉండటానికి ఇల్లు లేదు. పూట తిండి కోసం తల్లడిల్లే పరిస్థితి నెలకొంది.

ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ ఇఫ్రా తహ్సీన్.. ఆతిన సీఐ లక్ష్మీ బాబు కు సమాచారం అందించగా..వీర బ్రహ్మేంద్ర అనాథాశ్రమం నిర్వాహకుడు సీపెల్లి వీర మాధవ్ తో మాట్లాడి ఈ వృద్ధురాళ్లను చేర్పించారు. ఆపద సమయంలో అండగా నిలిచిన సీఐ.. కార్పొరేటర్ లను స్థానికులు అభినందించారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం డివిజన్ నాయకులు అహ్మద్, ఖాలీద్, నాహిద్, ముబీన్ తదితరులు ఉన్నారు.

# ఈనెల 27న ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహణ.... !

## -జిల్లా కలెక్టర్ హనుమంతరావు.

సంగారెడ్డి, సెప్టెంబర్ 25 (నేటినిజం ప్రతినిధి) ఈ నెల 27న స్వర్గీయ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ప్రభుత్వ ఉత్సవంగా ప్రకటించిందని ఆయన పేర్కొన్నారు. ఆ మేరకు జిల్లాలో ఈ నెల 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించనున్నట్లు తెలిపారు.

27న ఉదయం 10:30 గంటలకు సంగారెడ్డిలోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం,ఫల పరిశోధన కేంద్రం( ఈఖీూ) లో జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు .ఇట్టి కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, అనధికారులు, వివిధ సంఘాల నాయకులు ,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

# పట్టణ టీఆర్ఎస్ మైనారిటీ సెల్ కార్యదర్శిగా రాహిల్



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 25:(నేటినిజం ప్రతినిధి): టీఆర్ఎస్ వేములవాడ పట్టణ మైనార్టీ సెల్ కార్యదర్శిగా ఎంఏ రాహిల్ ఎన్నుకున్నారు. నియామక పత్రాన్ని టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు, ఏఎంసీ డైరెక్టర్ పీర్ మొహమ్మద్ అందజేశారు . ఈ సందర్భంగా ఎం.ఏ రాహిల్ మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సహకరించిన ఎమ్మెల్యే ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు , పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు , ఏఎంసి డైరెక్టర్ పీర్ మహమ్మద్ , కార్యదర్శి కందుల కాంతి, ఉపాధ్యక్షుడు రాపెల్లిశ్రీధర్, టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మహమ్మద్ సలీమ్ కు కృతజ్ఞతలు తెలిపారు . పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటిస్తూ అధిష్టానం నిర్ణయాలు తూచా తప్పకుండా పాటిస్తూ కౌన్సిలర్ ఆధ్వర్యంలో టీఆర్ఎస్ పార్టీ చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

# డ్రైనేజీపై పెట్టిన నెహ్రూ విగ్రహాన్ని భద్ర పరచాలని కాంగ్రెస్ ధర్నా.. రాస్తారోకో..!

## -విగ్రహాన్ని భద్రపరచి..త్వరగా నూతన విగ్రహాన్ని నెలకొల్పుతామని మున్సిపల్ కమిషనర్ హామీ



కరీంనగర్ సెప్టెంబర్ 25:(నేటినిజం ప్రతినిధి): నగరంలోని పాత ఎంప్లాయిమెంట్ ఆఫీస్ చౌరస్తాలో అభివృద్ధి పేరిట భారత తొలి మాజీ ప్రధాని దివంగత జవహర్ లాల్ నెహ్రూ విగ్రహాన్ని తొలగించి..నిర్లక్ష్యంగా సైడ్ డ్రైనేజీపై చాపలో చుట్టి భద్ర పర్చకుండా వదిలేసిన నగర పాలక సంస్థ వైఖరిని నిరసిస్తూ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పెద్ద ఎత్తున గంట పాటు ధర్నా.. రాస్తారోకో నిర్వహించారు. ఆసుపత్రుల ప్రాంతం కావడంతో ట్రాఫిక్ కు భారీగా అంతరాయం ఏర్పడింది. ఆందోళన కారులను శాంతిపజేయడానికి టూ టౌన్ ఎస్సైలు రవీందర్ నాయుడు, శ్రీనివాస రావులు ప్రయత్నించిన కాంగ్రెస్ శ్రేణులు ససేమిరా అనడంతో టూ టౌన్ సిఐ మున్సిపల్ కమిషనర్ కు ఫోన్ లో నెహ్రూ విగ్రహం మురుగు కాల్వ పై నుంచి తొలగించాలని కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేస్తున్నారని సమాచారం అందించగా కమిషనర్ యాదగిరి రావు ఆందోళన ప్రాంతానికి వచ్చారు. గత రెండు నెలలుగా మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు నెహ్రూ విగ్రహాన్ని తొలగించి భద్ర పర్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి.. కమిషనర్ కు చెప్పారు. స్పందించిన కమిషనర్ వెంటనే తొలగించి.. నూతన విగ్రహం త్వరగా నెలకొల్పేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కమిషనర్ హామీతో కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన విరమించారు. ఈసందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ జాతీయ నేతల విగ్రహాలపై అధికార టిఆర్ఎస్ ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని ఆరోపించారు. గాంధీ విగ్రహం గత ఏడాది అక్టోబర్ 2 నాటికి నెలకొల్పాల్సి ఉండగా ఏడాది గడిచిన నేటికి విగ్రహాన్ని పెట్టలేదని..అక్టోబర్ 2 నాటికి గాంధీ విగ్రహం నెలకొల్ప కుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పలు కార్యక్రమాల్లో జాతీయ నేతలను కీర్తించడం కాదని.. చిత్తశుద్ధి ఉంటే తొలగించిన విగ్రహాలను నెలకొల్పి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. బిఉప్పరి రవి, ఎండి తాజ్, సమద్ నవాబ్, రహమత్ హుస్సేన్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, శ్రవణ్ నాయక్, గడ్డం విలాస్ రెడ్డి, కొలిపాక సందీప్, కొరివి అరుణ్ కుమార్, దండి రవీందర్, అబ్దుల్ రహమాన్, పులి కృష్ణ, లింగంపెల్లి బాబు, బాలబద్రి శంకర్, కుర్ర పోచయ్య, సత్యనారాయణ రెడ్డి, దన్నా సింగ్, ముక్క భాస్కర్, ఎండి చాంద్, మేకల నర్సయ్య, జీడి రమేష్, ఖమరొద్దీన్, షాహిద్, తమ్మడి ఏజ్రా, లాయిఖ్ ఖాద్రి, ఇర్ఫాన్, నిహాల్, నదీమ్, కీర్తి, శహింషా, శబనా మహమ్మద్, ఎర్ర శ్రీనివాస్, పరదల లింగమూర్తి, బొబ్బిలి విక్టర్,జీలకర్ర రమేశ్, హస్తంపురం రమేశ్, సలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ×బి

# లక్షయువగలార్చన కార్యక్రమంలో ప్రతి హిందువు పాల్గొనాల్సిందే.. విశ్వ హిందూ పరిషత్



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 25:(నేటినిజం ప్రతినిధి): విశ్వ హిందూ పరిషత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టబోతున్న భగవత్ గీత లక్ష యువగలార్చన కార్యక్రమం విజయవంతం చేయాలన్న లక్ష్యంతో శనివారం వేములవాడ లోని శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానం లో ప్రత్యేక పూజలు జరిపించి పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. రాబోయే గీత జయంతి సందర్భంగా భాగ్యనగర్ (హైదరాబాద్) లో చేపట్టబోయే లక్షయువగలార్చన కార్యక్రమాన్ని విజయంతం అయ్యేలా దృష్టి పెట్టాలని.. ఇట్టి కార్యక్రమానికి శ్రీ ప్రధాని నరేంద్ర మోడీ గారు ప్రత్యేకంగా రావడం జరుగుతుంది కావున 15 నుండి 40 ఏళ్ల వయస్సు ఉన్న ప్రతి హిందూ యువతీ,యువకులు లక్ష భగవద్గీత అర్చన లో పాల్గొగలరుఅని విశ్వహిందూ పరిషత్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకర్తలు, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు పాల్గొన్నారు. హిందూ శక్తి జాగృత పరిచే విధంగా దిశ నిర్దేశం చేశారు.

# అగ్రహారం వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు నిరంతరం అన్నదానం



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 25:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మండలం అగ్రహారం లో ని వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు శనివారం నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభించడం జరిగింది ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ నార్ల రాజేశం వైస్ చైర్మన్ రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ భక్తులకు ప్రతిరోజు అన్నదానం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగటం జరిగింది .నిరంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించడకు శ్రీకారం చేపట్టామని అన్నారు అన్న దానం

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.